# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 2-11-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 83 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## జగన్ కోర్టుకు హాజరుకావాల్సిందే!

**- ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి షాక్**

**- ఆస్తుల కేసులో పిటీషన్ కొట్టేసిన సీబీఐ కోర్టు**

హైదరాబాద్, నవంబర్1(ఆర్ఎన్ఎ) : ఆస్తుల కేసులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీబీఐ కోర్టులో చుక్కెదురయ్యింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌ను హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టు డిస్మిస్ చేసింది. జగన్మోహన్‌రెడ్డి కోర్టుకు హాజరుకావాల్సిందేనని స్పష్టం చేసింది. సీబీఐ జగన్ పిటిషన్‌పై గట్టిగా వాదనలు వినిపించింది. ఈ కేసులో పరిస్థితులు మారాయని, నేరంలో ఎలాంటి మార్పు లేదని తెలిపింది. జగన్ ఎంపీగా ఉన్నప్పుడే సాక్షులను ప్రభావితం చేయాలని ప్రయత్నించారని జగన్ ఇప్పుడు సీఎం స్థానంలో ఉన్నారని, మినహాయింపు ఇస్తే సాక్షుల్ని ప్రభావితం చేస్తారని చెప్పింది. సీబీఐ వాదనతో ఏకీభవించిన సీబీఐ కోర్టు పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జగన్ ఆస్తుల కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ, జగన్ తరపు లాయర్లు తమ వాదనలు వినిపించగా కోర్టు తీర్పును నవంబర్ 1కి రిజర్వ్ చేసింది. జగన్ తరపు లాయర్లు తమ వాదనలు వినిపిస్తూ.. జగన్ ప్రస్తుతం ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నారని ప్రతి శుక్రవారం హైదరాబాద్ కోర్టుకు రావాలంటే ప్రభుత్వ ధనం దుర్వినియోగం కావడంతో పాటూ విధి నిర్వహణలో చాలా ఇబ్బందులు కలుగుతాయని లాయర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అందుకే తాము వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నామని చెప్పారు.

# డ్రైవర్ బాబు ఇంటివద్ద ఉద్రిక్తత

**- భారీగా తరలివచ్చిన ఆర్టీసీ కార్మికులు**
**- బాబు పార్థీవదేహానికి నివాళులర్పించిన అఖిలపక్షం నాయకులు**
**- దుర్వాసన వస్తుండటంతో అంత్యక్రియలకు నిర్ణయం**
**- కుటుంబ సభ్యులను ఒప్పించిన ఆర్టీసీ జేఏసీ నాయకులు**
**- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు**
**- పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసిన పోలీసులు**
**- కేసీఆర్ నియంత పాలనపై మండిపడ్డ నాయకులు**

కరీంనగర్, నవంబర్1(నేటినిజం ప్రతినిధి) : గుండెపోటుతో మృతిచెందిన ఆర్టీసీ డ్రైవర్ బాబు ఇంటి వద్ద శుక్రవారం ఉద్రిక్తత కొనసాగింది. ఆర్టీసీ కార్మికులు భారీ సంఖ్యలో తరలిరావటంతో పాటు అఖిలపక్ష నేతలందరూ కరీంనగర్ చేరుకోవటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండవ రోజు కరీంనగర్ బంద్ సాగింది. దుకాణందారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. మరోవైపు బాబు అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఒప్పుకున్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చే వరకు బాబు పార్థీవదేహానికి అంత్యక్రియలు నిర్వహించమని కుటుంబ సభ్యులు గురువారం నిర్ణయించారు. వీరికి మద్దతుగా బీజేపీ ఎంపీ సంజయ్, మందకృష్ణ మాదిగలు మద్దతుగా నిలవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. గురువారం రాత్రి మొత్తం మృతదేహం వద్దనే కుటుంబ సభ్యులు, ఎంపీ సంజయ్, ఆర్టీసీ కార్మికులు జాగారం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వం దిగివచ్చే ఆర్టీసీ సమస్యలపై చర్చలు జరిపే వరకు తాము బాబు పార్థీవ దేహానికి అంత్యక్రియలు నిర్వహించమని బీష్మించుకు కూర్చున్నారు. దీనికితోడు తెలంగాణలోని అన్ని డిపోల వారు కరీంనగర్ రావాలని ఆర్టీసీ జేఏసీ పిలుపునివ్వటంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులుసైతం భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. రామగుం డం పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, సిరిసిల్ల ఎస్పీ రాహుల్ హెగ్డేల ఆధ్వర్యంలో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఆర్టీసీ జేఏసీ నేతలు బాబు ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు. అనంతరం డ్రైవర్ బాబు అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆర్టీసీ జేఏసీ నేతలు ప్రకటించారు. బాబు కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.

బాబు మృతదేహంతో కరీంనగర్ డిపో – 2 బస్ డిపో వరకు ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించారు. భారీ సంఖ్యలో కార్మికులు తరలిరాలి రావటంతో బాబు అంత్యక్రియలను అశ్రునయనాల మధ్య అంతిమ యాత్ర సాగింది. అంతిమ యాత్రలో కోదండరాం, తమ్మినేని, చాడ, పొన్నం, మందకృష్ణ మాదిగ, ఎంపీ సంజయ్, ఆర్టీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు అంత్యక్రియల్లో భాగంగా మృతదేహాన్ని ర్యాలీగా బస్టాండ్ తీసుకెళ్లాలని ఎంపీ బండి సంజయ్ నిర్ణయించారు. దీనిని పోలీసులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ర్యాలీకి అనుమతించే ప్రసక్తి లేదని చెప్పారు. మరోవైపు ఎవరు అనుమంతించినా, అనుమతించక పోయినా బాబు మృతదేహంతో బయలుదేరుతామని, దమ్ముంటే అరెస్ట్ చేసుకోండంటూ.. ఎవరు ఆపినా ఆగే ప్రసక్తే లేదని బండి సంజయ్ పేర్కొన్నారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు నా వెంట రావాలంటూ సంజయ్ పిలుపునివ్వడం స్థానికంగా మరింత ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో ఆర్టీసీ జేఏసీ నాయకులు పోలీసులతో చర్చలు జరపడంతో ప్రశాంతంగా అంతిమ యాత్ర నిర్వహిస్తామని పేర్కొనడంతో పోలీసులు ఒప్పుకున్నారు. దీంతో అంతిమయాత్ర శాంతియుతంగా సాగింది.

### బాబు మృతదేహానికి నివాళులర్పించిన అఖిలపక్ష నేతలు..

ఇదిలాఉంటే శుక్రవారం బాబు పార్థీవ దేహాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, టీజేఏసీ అధ్యక్షుడు కోదండరాంలు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఒక నియంత అని.. ఆయనకు జ్ఞానం లేదని విమర్శించారు. కేసీఆర్ కారణంగా 50వేల కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయన్నారు. కార్మికులు చనిపోతుంటే.. కనికరం లేదా అని ప్రశ్నించారు. పట్టు విడుపులు ఉండాలని కేసీఆర్‌కు ఇంత అహం పనికి రాదని పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫాసిస్టు నిర్ణయాలతో ధనిక రాష్ట్రాన్ని దివాళా రాష్ట్రంగా మార్చారన్నారు. తన జేబులు నింపుకోవడం తప్ప.. సంక్షేమ పథకాలకు కూడా నిధులు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె 30రోజుల నుండి నడుస్తోందని, ప్రజలు రవాణా వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికుల సమస్యలు న్యాయబద్ధమైనవి అన్నారు. ఆర్టీసీ పూర్తి స్థాయి ఎండిని నియమించకుండా కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు జీతాలు ఇవ్వకుండా 50 వేల మంది కార్మికుల కుటుంబాలను రోడ్డుపై పడేసి చోద్యం చూస్తున్నారని అన్నారు. తక్షణమే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణలో రాక్షస పాలన – కోదండరాం

రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందని, కేసీఆర్ నియంతలా పాలన సాగిస్తున్నాడని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగిరావాలని అన్నారు. కేసీఆర్‌కు ఆర్టీసీ కార్మికుల పిల్లల పట్ల కనికరం లేదా..? ముఖ్యమంత్రికి నైతిక బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ వందల కొద్దీ పుస్తకాలు చదువుతానని చెబుతుంటాడని, ఎన్ని పుస్తకాలు చదివినా ఏం ఉపయోగమని, రాజ్యాంగాన్ని చదవడం మర్చిపోయారా అని కోదండరాం నిలదీశాడు. కోర్టులనుసైతం ధిక్కరిస్తూ కేసీఆర్ నియంతలా పాలన సాగిస్తున్నాడని కోదండరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం కోర్టుల వాటి సూచనలు పాటిస్తూ ప్రభుత్వం పాలన సాగించాలని, కానీ నాఇష్టమొచ్చినట్లు పాలిస్తామంటూ కేసీఆర్ అంటుండం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్టీసీ సమ్మెపై మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని కోదండరాం ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

### ఆర్టీసీ సమ్మెపై కేంద్రం జోక్యం చేసుకోవాలి – చాడ

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆర్టీసీ సమ్మెపై కేంద్రం జోక్యం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి అన్నారు. డ్రైవర్ బాబు మృతదేహానికి నివాళులర్పించారు. నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బాబుది చివరి మరణం కావాలన్నారు. చర్చలు జరపమని అనడం నియంత పాలనకు నిదర్శనమన్నారు. కేంద్రానికి ఆర్టీసీలో 30శాతం వాటా ఉందని, ఈ సమస్యపై కేంద్రం జోక్యం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ కార్మికుల పట్ల గవర్నర్ సానుకూలంగా స్పందించారని చాడ వెంకట్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నా కేసీఆర్ పంతానికి పోతూ నియంత పాలన సాగిస్తున్నాడని అన్నారు. ఇప్పటికే అనేక మంది కార్మికులు మృతిచెందారని, వీరి మరణాలన్నీ కేసీఆర్ వ్యాఖ్యల వల్లేనన్నారు. ప్రభుత్వం అంటే పెద్ద దిక్కుగా ఉండి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, అలా కాకుండా అసలు మీ ఉద్యోగాలేలేవు, సెల్ఫ్ డిస్మిస్ అంటూ సీఎం హోదాలో ఉండి కేసీఆరే అనడం సిగ్గుచేటన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ కేసీఆర్ మెడలు వంచి న్యాయమైన డిమాండ్‌లు సాధించుకుంటామని చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు.

### న్యాయస్థానం కార్మికుల వైపే – తమ్మినేని

న్యాయస్థానం కార్మికుల వైపే ఉందని, ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు న్యాయమైనవి కావట్టే కోర్టు కార్మికులవైపు నిలిచిందని తెతమ్మినేని వీరభద్రం అన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా ఉన్నారన్నారు. న్యాయస్థానం కూడా కార్మికుల వైపే ఉందన్నారు. ఆర్టీసీలో కేంద్రానికి 30శాతం వాటా ఉందని, కేంద్ర ప్రభుత్వం నిర్ణయం లేనిదే ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేయడం, ప్రైవేట్ బస్సులను తీసుకోవటం రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లదని అన్నారు. కార్మికుల సమ్మెకు బీజేపీ ఎలాగూ మద్దతు పలుకుతుంది కాబట్టి కేంద్ర ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ఆర్టీసీని తమ చేతుల్లోకి తీసుకోవాలని కేంద్రాన్ని తమ్మినేని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వారి వెంటే ఉంటామని, కేసీఆర్ మొండి వైఖరిని విడనాడి ఇప్పటికైన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అనుమానిత బ్యాగ్ లభ్యం

న్యూఢిల్లీ,నవంబర్1(ఆర్ఎన్ఎ): ఢిల్లీ విమానాశ్రయంలో అనుమానాస్పద బ్యాగ్ లభ్యమైంది. దీంతో పోలీసులు అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో ఎయిర్‌పోర్టు అధికారులకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి టెర్మినల్ –3లోని రెండో గేట్ వద్ద అనుమానాస్పద బ్యాగ్ ఉన్నట్లు చెప్పారు. ఫోన్ కాల్‌తో అప్రమత్తమైన అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సీఐఎస్ఎఫ్ సహాయంతో ఆ బ్యాగును మరో ప్రాంతానికి తరలించారు. అయితే ఆ బ్యాగును తెరవలేదు. దాంట్లో ఎలక్ట్రిక్ వైర్లు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఎయిర్‌పోర్టులో మరింత భద్రత పెంచారు. టెర్మినల్–3 వైపు ప్రయాణికులను పోలీసులు అనుమతించడం లేదు.

## బీబీ నగర్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని మృతదేహం

హైదరాబాద్,నవంబర్1 (ఆర్ఎన్ఎ): ఘటకేసర్ – బీబీనగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. వయసు 25 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు బ్లాక్ కలర్ టీషర్ట్, బూడిద కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు, రైలు టికెట్ కానీ లభించలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దుశ్చర్య

### రెండు వాహనాలకు నిప్పు

శ్రీనగర్,నవంబర్1(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులు దుశ్చర్యకు పాల్పడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రెండు వాహనాలకు ఉగ్రవాదులు నిప్పు పెట్టారు. ఇందులో ఒక స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకుడిది అని పోలీసులు తెలిపారు. ఈ ఘటన బీజేపీ నాయకుడు అదిల్ అహ్మద్ నివాసం బయట జరిగింది. అయితే ఉగ్రవాదులు వాహనాలకు నిప్పు పెట్టిన సమయంలో అదిల్ అహ్మద్ తన నివాసంలో లేరని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఆరుగురు కూలీలను మంగళవారం రాత్రి కుల్గాంలో ఉగ్రవాదులు హత్య చేసిన సంగతి తెలిసిందే.

## దంతాలు సరిగా లేవని త్రిపుల్ తలాక్

### హైదరాబాద్‌లో చట్ట విరుద్ధంగా చర్య

హైదరాబాద్,నవంబర్1(ఆర్ఎన్ఎ): దంతాలు సరిగా లేవని విడాకులు ఇవ్వడ"మేంటని అనుకుంటున్నారా? ఆశ్చర్య పోకండి.. ఇది నిజమే! హైదరాబాద్‌కు చెందిన రుక్సానా బేగంకు దంతాలు సరిగా లేవు. ఆమె దంతాలు వెనుక ముందుకు ఉన్నాయి. దీంతో ఆమెను భర్త గత కొన్ని నెలల నుంచి వేధించడం మొదలు పెట్టాడు. దంతాలు సరిగా లేవని.. రుక్సానాకు ఇటీవలే ఆమె భర్త త్రిపుల్ తలాక్ చెప్పేసి వెళ్లిపోయాడు. తాను తన భర్త వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ.. తమ మధ్య ఎలాంటి బంధం లేదని చెబుతున్నాడని ఆమె వాపోయింది. తనకు న్యాయం కావాలని రుక్సానా బేగం డిమాండ్ చేస్తుంది.

ఏకకాలంలో మూడుసార్లు తలాక్ చెప్పడం ద్వారా విడాకులిచ్చే పద్ధతిని క్రిమినల్ నేరంగా పరిగణించే ముస్లిం మహిళల(వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు–2019 బిల్లును పార్లమెంట్ ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదించడంతో ఆ బిల్లు చట్టం రూపం దాల్చింది. ముస్లిం మహిళకు మూడుసార్లు తలాక్ చెబితే.. కొత్త చట్టం ప్రకారం భర్తలకు మూడేళ్ల జైలు శిక్ష విధించనున్నారు.

# యువతకు ఉపాధి లక్ష్యంగా గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్: కేటీఆర్

**- టీఎస్ఐపాస్ ద్వారా 12లక్షల ఉద్యోగాలు కల్పించాం**
**- సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు అనుమతులిస్తున్నాం**
**- యువతకు ఉపాధి లక్ష్యంగా గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్**
**- పరిశ్రమల కోసం పర్యావరణాన్ని ఫణంగా పెట్టలేం**
**- గ్రీన్ఇండస్ట్రీకి మాత్రమే ఇందులో పెద్దపీట వేస్తున్నాం**
**- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్**

యాదాద్రి భువనగిరి, నవంబర్1(ఆర్ఎన్ఎ) : పారిశ్రామిక విధానంలో టీఎస్ఐపాస్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, దేశంలోని రాష్ట్రాలన్ని తెలంగాణ వైపు చూస్తున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. చౌటప్పల్ మండలంలోని దండుమల్కాపూర్‌లో టీఎస్ఐఐసీ – టీఐఎఫ్ – ఎమ్మెస్ఎంఈ – గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును శుక్రవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా గ్రీన్ ఇండస్ట్రీల్ పార్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. పారిశ్రామిక విధానంలో టీఎస్ఐపాస్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తెలంగాణ నాయకులకు పాలన వచ్చా అని ఎగతాళి చేసినవాళ్లే ఇవాళ మన విధానాలను అనుసరిస్తున్నారన్నారు. మాది తెలంగాణ అని గర్వంగా చెప్పుకునే స్థాయికి వచ్చామని కేటీఆర్ తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నామని, 15రోజుల్లో అనుమతులు రాకుంటే డీమ్డ్ అప్రూవల్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణది అన్నారు. పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేసిన అధికారులకు రోజుకు వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. టీఎస్ఐపాస్ ద్వారా 12 లక్షల ఉద్యోగాలు కల్పించామని, రాబోయే కాలంలో మరిన్ని ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు.

అన్ని రంగాలకు 24 గంటలు కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

పరిశ్రమల విషయంలో తెలంగాణ అనుసరిస్తోన్న విధానం రేపు దేశంలోని అన్ని రాష్ట్రాలకు రోల్‌మోడల్ అవుతుంది. ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీకి ప్రభుత్వం అండగా నిలబడుతోందని, 70శాతం ఉద్యోగాలు ఇచ్చేది ఎంఎస్ఎంఈ పరిశ్రమలే అన్నారు. ఎంఎస్ఎంఈకి పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తున్నామని కేటీఆర్ చెప్పారు.పర్యావరణహితంగా గ్రీన్ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేశామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పరిశ్రమలు తేవడమే కాదు వాటిని పర్యావరణహితంగా మారుస్తున్నామన్నారు. 435 ఎకరాల్లో పార్క్ ఏర్పాటు చేసినా మరింత స్థలం కావాలని కోరుతున్నారని, పార్క్ విస్తరణకు అవసరమైన భూసేకరణకు వెంటనే చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొనారు. గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును 2వేల ఎకరాలకు విస్తరిస్తామని తెలిపారు. పరిశ్రమల కోసం పర్యావరణాన్ని ఫణంగా పెట్టలేమని, గ్రీన్ఇండస్ట్రీక్రి మాత్రమే ఇందులో పెద్దపీట వేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. పార్కులో చాలా స్వల్ప ధరకు మౌలిక వసతులు కల్పించనున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. అంతర్గత రోడ్డు, కరెంట్, నీటి వసత వేగంగా పూర్తిచేస్తామన్నారు. ఏ పరిశ్రమ ఏర్పాటు చేసినా మహిళలకు ప్రత్యేక కోటా కేటాయిస్తున్నట్లు చెప్పారు. గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు దగ్గర 132 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తామన్నారు. వరంగల్‌లో దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేశామని, సంగారెడ్డి జిల్లాలో దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్క్ ఏర్పాటు చేశామని, ప్లాస్టిక్ పార్క్, మైక్రో ప్రాసెసింగ్ పార్క్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు.

### కేటీఆర్ పరిశ్రమల శాఖ మంత్రి కావడం మన అదృష్టం – ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ప్రజలు టీఆర్ఎస్‌ను నమ్ముతున్నరు కాబట్టే రెండోసారి అధికారం కట్టబెట్టారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గ్రీన్ ఇండస్ట్రీరియల్ పార్కు ప్రారంభం అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే మా బతుకులు బాగుపడతాయని, మా జీవితాల్లో వెలుగు నింపుతాయని ఎంతో ఆశతో కొన్ని లక్షల మంది యువకులు ఎదురుచూస్తున్నారని, అలాంటి యువకుల కోసం, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు చేపట్టిన కార్యక్రమం ఇదన్నారు. పారిశ్రామిక వేత్తలందరినీ ఈ వేదిక ద్వారా ఆహ్వానిస్తున్నామన్నారు. కేటీఆర్‌లాంటి అనుభవం, అవగాహన ఉన్న వ్యక్తి పరిశ్రమల శాఖ మంత్రి కావడం మన అదృష్టమని రాజగోపాల్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక మౌలిక వసతులతో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమలు పెట్టేందుకు వస్తున్న వారికి ధన్యవాదాలు తెలియజేశారు. టీఎస్ఐఐసీ–టీఐఎఫ్–ఎమ్మెస్ఎంఈ–గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు కోసం రైతులు తక్కువ ధరకు భూములిచ్చి పెద్ద మనసు చాటుకున్నారని అన్నారు. భూసేకరణ విషయంలో తోడ్పాడునందించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు, టీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**- అన్నివిధాల అన్నదాతలను ఆదుకుంటున్నాం**
**- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి**

మల్కాజిగిరి జిల్లా పూడూరులో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, నవంబర్1(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని, రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అన్ని విధాల సహాయసహకారాలు అందిస్తున్నారని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు.

శుక్రవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మేడ్చల్ మండలంలో గల పూడూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగిం చుకోవాలన్నారు. ధాన్యానికి కచ్చితమైన గిట్టుబాటు ధరను అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కేసీఆర్ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ వేగంగా పూర్తిచేసి రైతుల సాగుచేసే ప్రతీ ఎకరానికి సాగునీరు అందించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పాటు, ప్రాజెక్టులు, చెరువుల్లోకి నీరు చేరడంతో పంటలు కళకళలాడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం పెరిగిందని, అందుకు తగిన విధంగా కొనుగోళ్లు జరిపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. ప్రతి జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ఈ సమన్వయ సమితి అధ్యక్షులు నందారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సునీత, ఎంపీపీ పద్మజ, జెడ్పీటీసీ శైలజ, మార్కెట్ సొసైటీ అధ్యక్షులు ప్రభాకర్, సర్పంచ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుదాటుతున్న మహిళను ఢీకొన్న పాలవ్యాన్

హైదరాబాద్,నవంబర్1(ఆర్ఎన్ఎ): రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లోని ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది.

సాగర్ రింగ్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న అంజమ్మ అనే మహిళను పాల లారీ ఢీకొట్టింది. లారీ వేగంగా ఢీకొనడంతో అంజమ్మ రోడ్డుపై ఎగిరిపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది.

ఘటన జరిగిన వెంటనే లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### మహిళను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

నాగర్‌కర్నూల్ జిల్లాలోని వంగూరు మండలం తిప్పారెడ్డిపల్లి గేట్ వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ – శ్రీశైలం ప్రధాన రహదారిపై గుర్తు తెలియని మహిళను ఓ వాహనం ఢీకొట్టింది. దీంతో ఆ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఇంటి వద్దకే ఆధార్ సేవలు- పోస్టల్ శాఖ నిర్ణయం

హైదరాబాద్,నవంబర్1(ఆర్ఎన్ఎ): ప్రతి ఒక్కరికి ఆధార్ తప్పనిసరి

# తగిన నైపుణ్యాలు లేకపోవడం సమస్య...

నేటినిజం
శనివారం 2-11-2019

కార్మిక శక్తికి మించినది ఏమీలేదు. కానీ వారికి మిగిలింది కూడా ఏమీలేదు. మేడే ఒక్క రోజు సెలవు తప్ప. పెట్టుబడి దారీ వ్యవస్థ ఏ దేశమయినా అమెరికా కేంద్రస్థానం. రోజుకు పది, పదిహేను గంటలు పనితో విసిగిపోయిన కార్మికులు శ్రమదోపిడికి వ్యతిరేకంగా గళమెత్తిన సందర్భమే మేడే! అమెరికాలోని చికాగో నగరం వేదికగా 1986లో మే ఒకటవ తారీఖున పెల్లుబుకిన నిరసనకు మేడే పునాది. అదే తర్వాత ప్రపంచ కార్మికులకు పర్వదినమయింది. దానితోపాటే వీరికి కష్టాలు, కన్నీళ్ళు కూడా అధికమయ్యాయి. కట్టుబాట్లు పెరిగిపోయాయి. ఉద్యోగ భద్రత గాలిలో దీపమయింది. ప్రమాదాల బారిన పడినవారి పట్ల సానుభూతి, పరిహారం కూడా కొరవడింది. ముఖ్యంగా ప్రపంచ దేశాలను సుడిగాలి లా చుట్టేస్తున్న 'ప్రపంచీకరణ' కార్మికుల పాలిట ఆశనిపాతం అవుతోంది. ప్రజాస్వామ్యభారతం సైతం దీనికి మినహాయింపుకాదు. రెండు దశాబ్దాల క్రితం ఆర్థిక సంస్కరణలకు తెరలేచిన మన దేశంలో ఆర్థిక స్థితిగతులు, పని పరిస్థితులు రోజురోజుకూ తీసికట్టుగా మారిపోతున్నాయి. ఒక పనికి పదిమంది వరస కడుతున్నారు. కార్మికుల విలువలు పడిపోతున్నాయి. లెక్కకు ఎన్ని కార్మిక చట్టాలున్నా అమలులో చెత్తగా మారిపోతోంది. ఏదో ఒకపని, ఉద్యోగంలోని వారి పరిస్తితే ఇలా ఉంటే కొత్తగా ఉద్యోగాల్లోకి చేరినవారికి భిన్నమయిన సమస్యలు, సవాళ్ళు ఎదురవుతున్నాయి. ఉద్యోగ ఉపాధి రంగంలో పెనుసంక్షోభం దృష్ట్యా ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగిత ప్రబలే ప్రమాదం ఉందని ఐఎల్ఓ హెచ్చరిస్తోంది. దీనికి కారణాలు ఎన్నో ఉన్నాయి. కొత్త ఉద్యోగాల సంఖ్య పరిమితంగా ఉంటే తగిన నైపుణ్యాలు లేకపోవడం మరోసమస్య.

ఇటీవలి కాలంలో మనదేశంలో మరొక ముఖ్యాంశం ఉద్యోగాల సంఖ్యలో తగినంతగా సృష్టి లేకపోవడం ఏటా జెడీపీ పెరుగుతోంది. జనసంఖ్యా ఎక్కువవుతోంది. అయినా ఉద్యోగాలలో పెరుగుదల శూన్యం. ఇంతటి సంక్లిష్టమయిన పరిస్థితి మరేదేశంలో కూడా కనిపించదేమో! అయితే, ఏ దేశమయినా ఆర్థికంగా సమున్నత స్థానంలో ఉండాలంటే అక్కడ కార్మికుల శ్రమశక్తికి గుర్తింపు ఉండి తీరాలి. శ్రమించేవాడు లేకుంటే అభివృద్ధి సాధ్యం కాదన్నది నిర్వివాదం. ప్రభుత్వం, వివిధ సంస్థల యాజమాన్యాలు కార్మికులకు తగిన ప్రాధాన్యం ఇచ్చినపుడే సంపద సృష్టి సాధ్యం. యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అందుబాటులోకి వచ్చినా వాటిని నడిపేందుకు కూడా శ్రామికుడు కావాలి. అందుకే ఒక వస్తువుకు విలువను కల్పించేది కార్మికులేనని కారల్‌మార్క్స్ అన్నాడు. కార్మికులకు శ్రమకు తగిన ఫలితం లభించేవిధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! కార్మికులు నిరాశ, నిస్పృహల్లో మునిగిపోతుంటే ఏదేశమయినా అభివృద్ధి సాధించలేదు. ఆర్థికంగా అగ్రరాజ్యం కావాలని ఉబలాటపడుతున్న మన దేశం ఎంతో కీలకమయిన కార్మికశక్తిని విస్మరించి ముందుకు సాగడం సాధ్యం కాదని మరోసారి ప్రభుత్వం గుర్తిస్తే సార్థకత!!

## జాతీయ ఐక్యతా దినోత్సవం

సంగారెడ్డి, నవంబర్ 1(నేటినిజంప్రతినిధి): అకుంఠిత దీక్షతో, అపారమైన చాణక్యంతో సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత దేశాన్ని నిర్మించిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జిల్లా కలెక్టర్ ఏం. హనుమంత రావు అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 144 జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ ఆవరణలో అందరు ఉద్యోగస్థులతో దేశ ఐక్యతకు, సమగ్రతకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన రజాకార్లు భారత దేశంలో కలవమని, పాకిస్థాన్ తో రహస్య ఒప్పందం చేసుకున్న సందర్భంలో సైన్యాన్ని మోహరించి నిజాం నవాబులను తలవంచేలా చేసి అఖండ భారత దేశంలో విలీనం చేయడంలో పటేల్ కీలక పాత్ర పోషించారని అన్నారు. అందుకే వారిని ఉక్కు మనిషిగా పిలుస్తున్నామని, ఆయన జన్మ దినాన్ని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. ప్రతి ఒక్కరు ఐక్యమత్యంగా ఉంటూ దేశ సమగ్రతకు పాటుపడాలని కోరారు.

## నిఘా జాగృతి వారాన్ని పాటించిన ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ప్రాంత ఆదాయపు పన్ను విభాగం

హైదరాబాద్, నవంబర్ 1:ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ ప్రాంత ఆదాయపు పన్ను విభాగం ఈ నెల 28వ తేదీ నుండి నవంబర్ 2వ తేదీ వరకు నిఘా జాగృతి వారాన్ని పాటిస్తోందని ఆదాయపు పన్ను విభాగం ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ కార్యాలయం తెలిపింది. ఈ సందర్భం గా ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్ మెంట్ అధికారులు న్యాయవర్తన ప్రతిజ్ఞ ను స్వీకరించారు. "న్యాయవర్తన- ఒక జీవన మార్గం" అంశం పై హైదరాబాద్ లో ఏర్పాటైన ఒక కార్యక్రమం లో ఆదాయపు పన్ను విభాగం అధికారుల ను ఉద్దేశించి పూర్వ సెంట్రల్ విజిలెన్స్ కమిశనర్ శ్రీ కె.వి. చౌదరి ప్రసంగించారు. ఈ విభాగం అధికారులు ఎల్లవేళలా నైతిక నిష్ఠ ను అనుసరించాలని ఆయన ఉద్బోధించారు. విధుల నిర్వహణ లో ప్రమాణాల తో కూడిన ప్రక్రియల ను అనుసరించడానికి ప్రాముఖ్యాన్ని ఇవ్వాలని శ్రీ కె.వి. చౌదరి సూచించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ చీఫ్ కమిశనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్, ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ ప్రాంతం శ్రీ ఎన్. శంకరన్, హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ (ఐఎన్‌వి) శ్రీ ఆర్.కె. పాలివాల్, హైదరాబాద్ చీఫ్ కమిశనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ శ్రీ అతుల్ ప్రణయ్, కమిశనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ (అడ్మినిస్ట్రేషన్ మరియు టిపిఎస్) శ్రీ పీయూష్ సోన్‌కర్ లతో పాటు ఇతర సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు.

'విజిలెన్స్ అవేర్ నెస్ వీక్' లో భాగం గా హైదరాబాద్ ఆదాయపు పన్ను విభాగం తన అధికారుల కు మరియు సిబ్బంది కి వేరు వేరు పోటీల ను నిర్వహించడమే కాకుండా, హైదరబాద్ లోని పాఠశాలల, ఇంకా కళాశాల ల విద్యార్థుల కు వ్యాస రచన లోను, నినాదాల రచన లోను, ఇంకా వక్తృత్వం లోను పోటీల ను నిర్వహించింది.

### బంగారు భవిష్యత్తు..

## అందే రోజులు రాబోతున్నాయి

### – ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్
### – ఐటీ టవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన మంత్రి

మహబూబ్‌నగర్, నవంబర్ 1 (ఆర్ఎన్ఎ) : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అనంతరం అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ రాష్ట్రంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని, రాబోయే రోజుల్లో బంగారు భవిష్యత్ అందే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎక్సైజ్, పర్యటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా, ఎదిర ప్రాంతంలోని ఐటీ పార్కులో భాగంగా టవర్ నిర్మాణ పనులకు మంత్రి భూమి పూజ చేశారు.

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.. ఐటీ కారిడారు ఏర్పాటుతో వలసలు ఆగి భావి తరాలకు బంగారు భవిష్యత్తు అందే రోజులు రాబోతున్నాయని అన్నారు. తెలంగాణ ఆవిర్భవంతోనే పాలమూరు అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. హైటెక్ సిటీ నమూనాలో భవనం నిర్మిస్తామని, దశల వారిగా అభివృద్ధి చేస్తామని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.

ఆకర్షణీయమైన పథకాలతో పాలమూరు వైపు పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

అభివృద్ధి.. సంక్షేమ పథకాలతో పాలమూరు ప్రజల కన్నీరు తుడుస్తామన్నారు. సహజవనరులున్నప్పటికీ పాలమూరు గత పాలకుల వల్ల నిర్లక్ష్యానికి గురైందని, పాలమూరును అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతామన్నారు. కోర్టు కేసులతో పాలమూరులో అభివృద్ధిని అడ్డుకోవాలని చూశారని, సమస్యలను చేధించుకుంటూ పాలమూరును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. తెలంగాణ ఆవిర్భవంతోనే పాలమూరు అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందన్న ఆయన..పాలమూరు ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సహజ వనరులున్నప్పటికీ పాలమూరు గత పాలకుల వల్ల నిర్లక్ష్యానికి గురైందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు అభివృద్ధితో వలసలు వాపస్ రావాలన్నారు. అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతామని, కోర్టు కేసులతో పాలమూరులో అభివృద్ధిని అడ్డుకోవాలని చూశారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

# వణికిస్తున్న డెంగ్యూ జ్వరాలు

హైదరాబాద్, నవంబర్ 1:మొత్తంగా ఇప్పుడు ఇరు తెలుగు రాష్ట్రాల్లో డెంగ్యూ మహమ్మారి ప్రజల ప్రాణాలకు సవాల్ విసురుతోంది. విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఎవరిని అడిగినా, ఏ ఇంట్లో చూసినా జ్వరపీడితులు ఉంటున్నారు. జ్వరాలకు ప్రైవేట్ ఆస్పత్రులకు చేరి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం కారణంగా దోమల వ్యాప్తి పెరుగుతోంది. ఊరూవాడా ఎక్కడ చూసిన విష జ్వరాల బారిన పడి ప్రజలు మంచాన పడుతున్నారు. అయితే దోమల కారణంగానే అన్న విషయం గమనించడంలో ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

దోమల నివారణలో అటు ప్రజలు ఇటు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల డొల్లతనం డెంగ్యూ ప్రబలడానికి కారణంగా గుర్తించాలి. డెంగ్యూపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై తెలంగాణ హైకోర్టు కూడా ఇటీవల సీరియస్‌గానే స్పందించింది. తెలంగాణలోని మంచిర్యాలో డెంగ్యూకు ఒకే కుటుంబంలోని నలుగురు మృత్యువాత పడ్డ ఘటన తీవ్రంగా కలచివేసేదిగా ఉంది. ఎక్కడ చూసిన ఇప్పుడు డెంగ్యూ మరనాలపైనే చర్చ సాగుతోంది. డెంగ్యూ మరణాలపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. డెంగ్యూ ఇంకా వణికిస్తూనే ఉంది. గతంలో ఎన్నడూలేని విధంగా వేలల్లో డెంగ్యూ కేసులు నవోదుకావడం, గ్రామాలకు గ్రామాలు మంచం పట్టడంతో జనం తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. జ్వర బాధితులు ఆర్థికంగా, ఆరోగ్య పరంగా చితికిపోతున్నారు. స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన లోపం, గ్రామాలు, పట్టణాలనే తేడాలేకుండా ఇళ్ల పరిసరాలు కూడా అపరిశుభ్రంగా ఉండడం ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఒక్కో జిల్లాలో కనీసం వేయి నుంచి రెండు వేల మంది డెంగ్యూతో బాధపడుతున్నారు. అనధికారికంగా చూస్తే ఈ సంఖ్య రెట్టింపు ఉంటుందని అంచనా. స్వచ్ఛభారత్, పచ్చదనం, పరిశుభ్రత, ఇలా ఎన్ని కార్యక్రమాలు తీసుకుంటున్నా.. కిందిసాయిలో సక్రమంగా అమలు చేయకపోవడం వల్లే ప్రతీఏటా దోమలు విజృంభి స్తున్నాయి. గ్రామాలు,పట్టణాలు అన్న తేడా లేకుండా అపరిశుభ్ర వాతావరణం పెరుగుతోంది. ఇళ్ల పరిసరాలన్నీ నీటిగుంటలు, మురికినీటితో నిల్వ ఉండడం, ఇళ్లచుట్టూ పిచ్చి మొక్కలు పొదలుగా ఉండడం, తదితర కారణాలతో దోమలువ్యాప్తి చెంది గ్రామాల్లో డెంగ్యూ ప్రబలుతోంది. పంచాయతీల్లో నీనీరోడ్లు, డ్రెయినేజీలున్నా.. అనేక ప్రాంతాల్లో నీళ్లు నిల్వ ఉండడం, చుట్టూ నీటిప్రవాహం కారణంగా తేమ ఉండడం, దోమల వ్యాప్తికి కారణమయ్యాయి. స్వచ్ఛత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 30రోజుల ప్రణాళికతో కొంత కదలిక కనిపించినా.. శివారు కాలనీల ప్రజల్లో, హోటళ్లు, షాపులు, వ్యాపారకూడళ్లలో మాత్రం మార్పు లేదు. పంచాయతీ, పట్టణాల్లోని కాలనీల్లో అవగాహన రాకపోవడంతో స్వచ్ఛత కార్యక్రమాలు మొక్కుబడిగా మారుతున్నాయి. పారిశుధ్యం విషయంలో రావాల్సినంత మార్పురాలేదని విజృంభిస్తున్న డెంగ్యూనే చెబుతోందని పలువురు అంటున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మరిన్ని మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. డెంగ్యూ కారణంగా జ్వరాలు తగ్గినా నీరసం తగ్గడంలేదు. ఏ పనీ చేయలేక పోతున్నారు. చేసిన అప్పుతీర్చలేని పరిస్థితిలో ప్రజలు అప్పుల పాలయ్యారు. డెంగ్యూ జ్వరాలపై ముందే ప్రజలకు తెలియచేస్తే ఎవరూ మరణించరని గుర్తించినా పెద్దగా ప్రచారం ఉండడం లేదు. ఇక్కడ జ్వరం సోకిన బాధితులంతా ప్రైవేటు ఆసుపత్రులకు, హైదరాబాదు కార్పొరేట్ ఆసుపత్రులకు ళ్లి వైద్యం కోసం పరుగులు తీస్తున్నారు. ఒక్కో కుటుంబం రూ.50వేలనుంచి 3లక్షల వరకు ఖర్చుచేయక తప్పడం లేదు. గిరిజన ప్రాంతాల్లో డెంగ్యూ పంజాతో కుటుంబాలకు కుటుంబాలే అనారోగ్యానికి గురయ్యాయి. ప్రజలకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు సూచిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా బారిన పడినవారు ఎంతమంది చికిత్స పొందుతున్నారని తదితర వివరాలను తెలుసుకుంటున్నారు. డెంగీ వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలపాల్సి ఉందన్నారు. గర్భిణులు, నవజాత శిశువులకు టీకాలు ఎప్పటికప్పుడు వేసుకుంటున్నారా.. లేదా.. ఆరా తీశారు. వేసిన వెంటనే ఆన్‌లైన్‌లో నవోదు చేయాలని సూచించారు. జిల్లాల్లో రక్త హీనత సమస్య ఎక్కువగా ఉందని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రబలుతున్న విషజ్వరాల నుంచి తప్పించుకోవడానికి ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజల్లో కూడా మార్పు రావడం లేదు. పారిశుధ్యం విషయంలో లెక్కలేని తనం కనిపిస్తోంది. పరిసరాల నుంచి దుర్గంధం వ్యాపిస్తూ, దోమలు విజృంభిస్తున్నా ఇదేదో ప్రభుత్వ కార్యక్రమంగా ప్రజలు భావిస్తున్నారు. నీరు నిల్వకుండా, చెత్త పేరుకుపోకుండా చూసుకుంటే దోమలు వ్యాప్తి చెందవు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని గుర్తించాలి. ప్రతిఒక్కరూ రోజులో కనీసం ఐదు నిమిషాలు పరిసరాల పరిశుభ్రతకు కేటాయించాల్సి ఉంది. అయితే ఇవేవీ గుర్తించడం లేదు. పరిసరాలు ఏమైతే నాకేంటన్న ధోరణిలో ముప్ప కొని తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం గ్రామీణ పారిశుద్యంపై శ్రద్ధ పెట్టాలి. కఠినంగా అయినా ప్రజలను ఇందుకు అలవాటు చేయించాలి. అప్పుడే దోమల నివారణ సాధ్యం కాగలదు. విషజ్వరాలను అదుపులో పెట్టగలం.

# దోమల వ్యాప్తితో విషజ్వరాల విజృంభణ

### వానాకాలం వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి
### పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలంటున్న వైద్యులు

హైదరాబాద్,నవంబర్1(ఆర్ఎన్ఎ): దోమల వల్ల వచ్చే రోగాలతో అప్రమత్తంగ ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో విషజ్వరాలు ప్రబలుతున్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలుషిత నీరు, ఆహారం ద్వారా డయేరియా వ్యాప్తి చెందుతుంది. కలుషిత నీరు, నిల్వ ఉంచిన ఆహారానికి దూరంగా ఉండాలి. పరిసర, వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం. క్లోరిన్ కలిపిన నీరు వాడాలి. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవాలన్నారు. ఇళ్లు, చుట్టుపక్కల ప్రాంతాల్లో దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. అపరి శుభ్రతకు తావులేకుండా చూడాలి.

దోమలు పెరిగే ఆవాసాలను ముందుగానే గుర్తించి అవి పెరగకుండా చూడాలి. అన్ని రకాల నీటి నిల్వల్లో వారానికి ఒకసారి దోమ పిల్లల నియంత్రణ మందులు చల్లించాలి. చెరువులు, బావులు, పెద్దపెద్ద నీటి మడుల్లో గంబూషియా చేపపిల్లలను వదలడం వల్ల దోమలను నాశనం చేయవచ్చు. ఇంటి ఆవరణలో పనికిరాని వస్తువులు, కొబ్బరి చిప్పలు, కూలర్లు, టైర్లు, పాత సామగ్రిలో నీళ్లు నిల్వ లేకుండా చూడాలి. బయటికి వెళ్లిన సమయంలో కాళ్లను, చేతులను పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను వేసుకోవాలి. నీటి సంపులు, ట్యాంకులపై మూతలు ఉంచాలి. పడుకునేటప్పుడు దోమ తెరలు వాడుకోవాలి. వేడిగా ఉన్న ఆహార పదార్థాలనే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈకోలి, ఈకోలి ఎర్సీనియా, సాల్మనెల్లా తదితర బ్యాక్టీరియాల కారణంగా డయేరియా వస్తుంది. వాంతులు, విరోచనాలు ఎక్కువగా ఉంటాయి. కడుపునొప్పి, దాహం, నోరు ఎండిపోవడం, చర్మం ముడతలు పడతాయి. మూత్రవిసర్జన పూర్తిగా తగ్గిపోతుంది. సకాలంలో వైద్యం అందకపోతే వ్యాధి ముదిరి గ్యాస్ట్రో ఎంటరైటిస్గా మారుతుంది. పరిసరాలు పరిశుభ్రంగా లేని ప్రదేశాల్లో కలరా అనే సూక్ష్మజీవి ద్వారా అంటువ్యాధిగా వ్యాప్తి చెందుతుంది. ఇది పేగుకు సంబంధించిన ప్రమాదకర వ్యాధి. రోగి వాంతి, మలం నుంచి ఈ రోగ కారక క్రిములు ఇతరులకు వ్యాపించే ప్రమాదముంది. కలరా సోకితే పదేపదే వాంతులు, నీళ్ల విరోచనాలు అవుతూ అకస్మాత్తుగా అస్వస్థతకు గురవుతారు. శరీరం చల్లబడి, చర్మం పొడిబారి దాహం ఎక్కువగా వేస్తుంది. మూత్రం రాకపోవడం, కళ్లలో పలికి పోవడం రోగ లక్షణాలుగా చెప్పొచ్చు. ఇలాంటివి కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వ్యాధి సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియాతో వ్యాపిస్తుంది. విరోచనాలు, ఎక్కువగా జ్వరం ఉండడం దీని లక్షణాలు. కలుషిత నీరు, ఆహారంతో వ్యాప్తి చెందుతుంది. రక్త పరీక్షల ద్వారా వ్యాధిని వైద్యులు నిర్ధారిస్తారు. త్వరగా జీర్ణమయ్యే పోషకాహారంతోపాటు విశ్రాంతి తీసుకోవాల్సిందే. వానకాలంలోఎలర్జీలు ఎక్కువగా వస్తుంటాయి. వానకు తడవడం, వాతావరణంలో మార్పులు, పొలం పనులు, కలుషిత నీటి వల్ల చర్మ వ్యాధులు, జలుబు, దగ్గువంటివి వస్తుంటాయి. వీటి విషయంలో ప్రజలు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పర్సనల్ కేర్ చాలా ముఖ్యం. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేతిరుమాలును ముక్కు, నోరుకు పూర్తిగా కప్పి ఉంచడం, ఇలాంటి వారి దగ్గరకు పోకుండా ఉండడం, వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవడం, షేక్ హ్యాండ్‌లు ఇచ్చుకోకపోవడం వంటివి చేయాలి.

### రూ.10లక్షల కోసం..

# రజిత హత్యకు దారితీసింది

### – ప్రియుడు శశికుమార్‌తో కలిసే కీర్తి తల్లిని హతమార్చింది
### – గతంలోనే నిద్రమాత్రలు ఇచ్చి హతమార్చే యత్నం
### – దృశ్యం చిత్రానికి సీక్వెల్‌లా హత్య ఉదంతం సాగింది
### – ముగ్గురిపై కేసులు నమోదు చేశాం
### – విలేకరుల సమావేశంలో రాచకొండ సీపీ మహేశ్ భగవత్

హైదరాబాద్, నవంబర్ 1(ఆర్ఎన్ఎ) : రూ. 10లక్షల కోసం తన ప్రియుడుతో కలిసి కీర్తీరెడ్డి తన తల్లి రజితను హతమార్చిందని రాచకొండ సీపీ మహేశ్ భగవత్ తెలిపారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునగనూరులో రజిత హత్యకేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు గురువారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకం ప్రకారమే ఈనెల 19న ఆమెను హత్య చేశారని, నిందితులు కీర్తి, శశికుమార్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఆస్తి, నగదు కోసమే కీర్తిరెడ్డిని శశికుమార్ బ్లాక్ మెయిల్ చేయడం.. రజిత హత్యకు దారితీసిందని మహేశ్ భగవత్ స్పష్టం చేశారు. అయితే బాల్‌రెడ్డి అనే యువకుడు.. కీర్తితో ఫ్రెండ్‌షిప్ పేరుతో స్నేహం చేశాడని, ఆ తర్వాత ఆమెపై అత్యాచారం చేశాడని అన్నారు. అయితే కీర్తిని బాల్‌రెడ్డి అత్యాచారం చేయడంతో ఆమె గర్భం దాల్చిందని, అప్పటికే శశికుమార్ రెడ్డి అనే యువకుడు కీర్తిరెడ్డికి పరిచయమై ఉన్నాడని, ఆ పరిచయంతో కీర్తిరెడ్డిని ఆమన్‌గల్ తీసుకెళ్లి అబార్షన్ చేయించాడని తెలిపారు. అయితే ఈ అబార్షన్‌ను ఆసరాగా తీసుకున్న శశికుమార్.. రజిత ఆస్తిపై కన్నేశాడని భగవత్ తెలిపాడు. రజిత వద్ద ఉన్న రూ. 10 లక్షలు, ఆస్తి కోసం కీర్తిరెడ్డిని శశికుమార్ బ్లాక్‌మెయిల్ చేశాడని, ఆ ప్రాపర్టీని దక్కించుకోవాలనుకున్న శశికుమార్.. రజితను అంతమొందించాలని ప్లాన్ చేశాడని అన్నాడు. దీంతో పక్కా ప్రణాళికతో కీర్తిని బ్లాక్‌మెయిల్ చేస్తూ.. తల్లి హత్యకు ప్రేరేపించాడని భగవత్ వివరించాడు. అయితే రజితను చంపేందుకు గతంలోనే నిద్రమాత్రలు ఇచ్చినట్లు తమ విచారణలో తేలిందని సీపీ తెలిపారు. ఆ ప్రయత్నం విఫలం కావడంతో.. ఈ నెల 19వ తేదీన రజిత సొంతింట్లోనే చున్నీతో కీర్తి, శశిలు కలిసి ఉరేసి చంపేశారని అన్నారు. రెండు, మూడు రోజుల తర్వాత ఒక బ్లాంకెట్‌లో రజిత మృతదేహాన్ని చుట్టి.. శశి కారులో రామన్నపేట రైలు పట్టాల వద్దకు తీసుకెళ్లి వదిలేశారని వెల్లడించారు. మృతదేహాన్ని అక్కడ వదిలేసి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో దారి మధ్యలో పెట్రోల్ తీసుకుని బ్లాంకెట్‌ను కాల్చేశారని, తమపై నేరం రాకుండా ఉండేందుకు యువతి, యువకుడు చాలా ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలమయ్యారని అన్నారు. బ్లాంకెట్‌ను కాల్చేసిన ఆధారాలు లభ్యమయ్యాయని, ఉరేసిన చున్నీ కూడా దొరికిందని తెలిపారు. రజిత హత్య కేసును విచారిస్తుంటే మొత్తం నాలుగు కేసులు బయటపడ్డాయని సీపీ తెలిపారు. ఒకటేమో రజిత మృతదేహంపై గుర్తు తెలియని డెడ్‌బాడీగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారని, మరో మూడు కేసులు.. రూ. 10 లక్షల కోసం కీర్తిని డిమాండ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేశాడని, అంతేకాకుండా ఆమెపై అత్యాచారం చేశాడని, ఈ కేసులో డిమాండ్, అత్యాచారం, పోక్సో చట్టం కింద శశికుమార్‌ను అరెస్టు చేశామని తెలిపారు. ఇంక రెండో కేసు విషయానికి వస్తే రజిత హత్య కేసులో కీర్తిరెడ్డి, శశిని అరెస్టు చేశామని, ఇక మూడో కేసు.. కీర్తిరెడ్డిని అత్యాచారం చేయడంతో బాల్‌రెడ్డిని అరెస్టు చేశామని సీపీ పేర్కొన్నారు. మొత్తంగా ఈ మూడు కేసుల్లో కీర్తి, శశికుమార్, బాల్‌రెడ్డిని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. విచారణ కోసం పోలీసు కస్టడీలోకి తీసుకుంటామని, ఈ కేసుల్లో భాగంగా మృతదేహాన్ని తరలించడానికి వాడిన శశి కారుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని మహేశ్ భగవత్ తెలిపారు. ఈ ఘటన దృశ్యం చిత్రానికి ఇది రెండో పార్ట్‌గా కనిపిస్తుంది అని మహేశ్ భగవత్ పేర్కొన్నారు. తమపై నేరం రాకుండా కీర్తి, శశికుమార్ చాకచాక్యంగా వ్యవహరించారని, రజితను చంపిన తర్వాత కీర్తి.. తన తల్లి గొంతు మాదిరిగా రజిత ఫోన్ నుంచి బాల్‌రెడ్డికి ఫోన్ చేసిందని, నేను వైజాగ్ వెళ్తున్నా.. మా కూతురిని మీ ఇంటికి పంపిస్తున్నానని బాల్‌రెడ్డితో కీర్తిరెడ్డి స్వరం మార్చి చెప్పిందని సీపీ తెలిపారు. కీర్తి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి వచ్చిన తర్వాత అసలు విషయం వెలుగు చూసిందని, మా తల్లి కనబడడం లేదని కీర్తి రెడ్డి స్వయంగా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విజృంభిస్తున్న డెంగ్యూ

### అనధికార మరణాలు పట్టించుకోని అధికారులు

ఖమ్మం,నవంబర్1(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత రెండేళ్లుగా వరసగా డెంగ్యూ కేసులు విపరీతంగా నమోదు అవుతున్నాయి. గిరిజన ప్రాంతాలతో పాటు మారుమూల గ్రామాలు సైతం విషజ్వరాలకు అల్లాడుతున్నాయి. చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో పెద్దవిత్తున ఇలాంటి కేసులు నమోదవుతున్నాయి. గడిచిన 4నెలల్లో జ్వరాలతో ఈ ఒక్క గ్రామంలోనే పదిమంది వరకు మరణించినట్టు అనధికారిక లెక్కలున్నాయి. సుమారు 4వేలకు పైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో అధికారిక లెక్కల ప్రకారంగానే సగం మందికి పైగా జ్వరాల బారినపడ్డారు. ఇందులో 145 డెంగ్యూ పాజిటివ్ కేసులు ఉన్నాయి. జ్వరాలతో కొల్లిరామకోటి, వంకాయలపాటి లక్ష్మినర్సమ్మ, అంబటి రామయ్య, మంకెన రాములమ్మ, తాత కోటయ్య, మంకెన బేబి, ఏరువు లక్ష్మీబాయి, మోదుగు శ్రీను, వ్డడెబోయిన కోటమ్మ, వేముల విజయ, బొగ్గు చాందిని తదితరులు మరణించారు. తిరుమలాయపాలెం మండలంలోని జింకలగూడెం మొత్తం డెంగ్యూ బారినపడింది. గడిచిన రెండు నెలలుగా గ్రామంలో ఉన్న కుటుంబాల్లో చాలా వరకు ఖమ్మం ప్రభుత్వ, ప్రైవేటు ఆస

# సిద్దిపేటలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి

## నిర్మాణాలు పరిశీలించిన మంత్రి హరీష్ రావు

సిద్దిపేట, నవంబర్ 1(ఆర్ఎన్ఎ): పట్టణంలోని నాగుల బండ పరిధిలో నిర్మిస్తున్న ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి నిర్మాణ పనులను మంత్రి హరీష్ రావు , ఎల్వి ప్రసాద్ సంస్థ చైర్మన్ డా.జి ఎన్ రావుతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ ప్రాంతానికి ఈ ఆసుపత్రి రావడం ఇక్కడి ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. హైదరాబాద్‌కు వెళ్లకుండా కంటి చికిత్సలు చేసుకొనే ఆవకాశం మన సిద్దిపేటలోనే రాబోతుందని తెలిపారు. ఆస్పత్రి నిర్మాణ పనులపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు , నిర్మాణం అద్భుతంగా ఉందన్నారు. డిసెంబర్ నెలలో ప్రారంభానికి సిద్ధం చేయాలని , ఆదిశగా మిగులు పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు చెప్పారు..డిసెంబర్ 15 న ప్రారంభం చేసుకుందాం, అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.. చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టి , చెట్లు నాటాలని సూచించారు. ఇకపోతే హోటల్స్, దాబా, బేకరీ, రెస్టారెంట్స్ వ్యాపారస్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు మంత్రి హరీష్ రావు. గురువారం సిద్దిపేటలో మాట్లాడిన ఆయన..ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. సిద్దిపేటకు వివిధ జిల్లాల నుండి వస్తూవుంటారని వారికి శుభ్రమైన ఆహారాన్ని ఇవ్వాలని సూచించారు. కొన్ని హోటళ్ల ముందు, బేకరీ వద్ద చెత్త చెదారం ఉంటుందని.. అలాంటి వారు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాపారస్తులకు శిక్షణతో పాటు, సర్టిఫికెట్ ఇస్తామని..అయినా మారకపోతే.. వారికి జరిమానాలు విధిస్తామన్నారు. కల్తీ పదార్థాలు, కల్తీ నూనె వాడటంతో క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయని..ప్లాస్టిక్ కవర్ లను త్వరలో బ్యాన్ చేస్తామన్నారు. మున్సిపల్ నుండి ఫుడ్ సర్టిఫికెట్ లు ఇస్తామని.. వాటిని చూసి ప్రజలు తింటారని హరీష్ తెలిపారు .

# కొత్త విమానయానాలతో ఆర్థికాభివృద్ధి

## మధ్యతరగతికి మరింత చేరువ కానున్న ప్రయాణం

న్యూఢిల్లీ, నవంబర్ 1(ఆర్ఎన్ఎ): 2024 నాటికి దేశవ్యాప్తంగా 100 కొత్త విమానాశ్రయాలు ప్రారంభం కానున్నాయి. దీనికోసం రానున్న ఐదేళ్లలో విమాయన రంగంలో ప్రభుత్వం లక్ష కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఆసియా ఖండంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్ ఆర్థిక వృద్ధిని పెంపొందించే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ కోసం గతవారం జరిగిన ఓ సమావేశంలో కేంద్రం ఈ ప్రతిపాదనపై చర్చించినట్టు తెలుస్తోంది. ఇందులోభాగంగా కొత్తగా 1000 రూట్లను చిన్న పట్టణాలు, ప్లలెలను అనుసంధానించాలని కేంద్రం ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. గత ఆరేళ్లలో ఎన్నడూ లేనంతగా దేశ ఆర్థిక వృద్ధి తగ్గిపోవడం, మరింతగా దిగజారే పరిస్థితులు కనిపిస్తుండటంతో ప్రధాని నరేంద్రమోడీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల ద్వారా ఆర్థిక వృద్ధిని గాడిలో పెట్టే ప్రయత్నాలు ప్రారంభించినట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తద్వారా బ్జడెట్‌లో ప్రతిపాదించినట్లుగా 2025 నాటికల్లా భారత ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని మోదీ సర్కార్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మధ్యతరగతి వారికి కూడా విమాన ప్రయాణం అందుబాటులో ఉండాలని కేంద్రం భావిస్తోంది. ఇందులో భాగంగా సింగపూర్ ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఏషియా ఎయిర్‌లైన్స్‌లకు స్థానికంగా తమ యూనిట్లను నెలకొల్పేందుకు అనుమతి ఇచ్చింది. ఇంధనంపై కూడా పన్నులు చాలావరకు తగ్గించింది. ఇక డ్రోన్లను కూడా వినియోగించు కోవాలని భారత్ భావిస్తోంది. 2024 నాటికి చట్టబద్ధంగా మిలియన్ డ్రోన్లను తిప్పాలని భారత సర్కార్ భావిస్తోంది. 2021 నాటికల్లా డ్రోన్ కారిడార్లను ఏర్పాటుచేసి 2023 కల్లా సరుకులను డ్రోన్ల ద్వారా రవాణా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చర్యల్లో భాగంగా గత నెలలో ప్రభుత్వం కార్పొరేట్ పన్నుల్లో కోత విధించిన సంగతి తెలిసిందే. వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలకు పెట్టుబడులు తరలివెళ్లకూడదనే ఉద్దేశంతో కార్పొరేట్ పన్నులను తగ్గించిందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. విమానాశ్రయాల అభివృద్ధిలో భారత్ చైనా కంటే వెనకపడి ఉంది. చైనా 2035నాటికి 450 కమర్షియల్ విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని భావిస్తోంది. ఏడాదికి 600 మంది పైలట్లతో దేశీయ విమానాలు నడిపేలా కేంద్రం ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. భారత్‌లో చిన్న పట్టణాలకు విమానాలు నడపకపోవడంవల్ల మూడేళ్ల క్రితం 450 రన్‌వేలు ఉండగా.. ప్రస్తుతం 75 రన్‌వేలు మాత్రమే పనిచేస్తున్నాయి. పాత రన్‌వేలపై విమానాలను నడిపేందుకు విమానాయాన సంస్థలు సంకోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ రంగ అభివృద్ధి కోసం మోడీ సర్కార్ 38 విమానాశ్రయాలను అభివృద్ధి చేసి కొన్ని ప్రాంతాలకు టికెట్ ధరలు కూడా తగ్గించింది. అంతేకాదు మరో 63 విమానాశ్రయాలకు తమ విమానాలను తిప్పాల్సిందిగా ప్రభుత్వం కాంట్రాక్ట్ కూడా ఇచ్చింది.

# ములాయంతో తరచూ యోగీ భేటీ

## రాజకీయ వ్యూహం ఉంటుందన్న టాక్
## కొట్టి పారేసిన సిఎం యోగి

లక్నో, నవంబర్ 1 (ఆర్ఎన్ఎ): యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాజకీయం ఉత్తరాదిన కొత్త సమీకరణలపై సరికొత్త చర్చకు తెరలేపింది. బిజెపికి చిరకాల ప్రత్యర్థి అయిన కురువృద్ధ నేత, సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ కేంద్రమంత్రి, యుపి మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్‌ను యోగీ ఆదిత్యనాథ్ తరచూ కలుస్తుండడం రాజకీయ వర్గాల్లో పెను దుమారాన్ని రేపుతోంది. ఇదివరకు ములాయం ఆరోగ్యం బాగాలేనందునే కలిశానని చెప్పు కొచ్చిన యోగీ ఆదిత్యనాథ్ మరోసారి ములాయం సింగ్‌ను కల్వడానికి కారణం మాత్రం దీపావళి శుభాకాంక్షలు తెలిపేందుకేనంటున్నారు. కానీ.. రాజకీయంగా చిరకాల ప్రత్యర్థి.. బిజెపికి ఒకప్పుడు బద్ధ శత్రువు అయిన ములాయంను తరచూ కల్వడం వెనుక రాజకీయ వ్యూహాలు కచ్చితంగా వుంటాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బుధవారం ములాయం ఇంటికి వెళ్ళినపుడు ఆయన తనయుడు, ప్రస్తుతం సమాజ్‌వాదీ పార్టీ సారథి, మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ కాకుండా? ఎస్పీ నుంచి బహిష్కృతుడైన ములాయం సోదరుడు శివపాల్ యాదవ్ వున్నారు. ఆయన కొద్దికాలం క్రితం అఖిలేశ్ యాదవ్‌తో విభేదించి ప్రగతిశీల్ సమాజ్‌వాదీ పేరిట వేరు కుంపటి పెట్టుకున్నారు. అయినప్పటికీ సోదరుడు ములాయంతో సన్నిహితంగానే మెదులుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్లమెంటు సాక్షిగా నరేంద్రమోదీ తిరిగి భారత ప్రధాని కావాలనుకుంటున్నానంటూ కామెంట్ చేసి.. విపక్షాలను నివ్వెర పరిచిన ములాయం సింగ్‌ని యోగీ కల్వడం వెనుక వ్యూహాలు కచ్చితంగా వుంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత జూన్ నెలలో కూడా యోగీ ఆదిత్యనాత్ ములాయంను కలిశారు. అప్పట్లో ములాయం అనారోగ్యంతో వుండడంతో ఆయన్ను పరామర్శించేందుకు వెళ్ళినట్లు అప్పట్లో సీఎంవో వర్గాలు చెప్పాయి. తాజాగా బుధవారం వీరిద్దరు కలిసిన విషయంపై అటు యోగి గానీ, ఇటు ములాయం కానీ నోరు మెదపలేదు. కానీ సీఎంఓ వర్గాలు మాత్రం పాత పాటే పాడాయి. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని చెబుతున్నాయి. అయితే ఇటీవల జరిగిన ఉప ఎన్నికలకు ఈ భేటకి లింకుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల యుపిలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. వీటిలో ఎనిమిది స్థానాలను బిజెపి, దాని మిత్ర పక్షం అప్నాదళ్ పార్టీలు గెలుచుకోగా.. సమాజ్‌వాదీ పార్టీ 3 స్థానాల్లో గెలుపొందింది. ఉప ఎన్నికల ప్రచారంలో అఖిలేశ్ యాదవ్ యోగీ సర్కార్‌పై నిప్పులు చెరుగుతూ ప్రచారం నిర్వహించగా.. ములాయంకు సన్నిహితంగా వుంటున్న ఆయన పెద్ద తమ్ముడు, ప్రగతిశీల్ సమాజ్‌వాదీ పార్టీ అధినేత శివపాల్ యాదవ్ మాత్రం యోగీతో సత్సంబంధాలు మెయింటేన్ చేస్తున్నారు. అందువల్లే యోగీ ప్రభుత్వం శివపాల్ సింగ్ యాదవ్‌కు ప్రభుత్వ బంగ్లాను సైతం కేటాయించింది. అదే సమయంలో అఖిలేశ్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు తన తండ్రి ములాయం సింగ్ యాదవ్‌కు కేటాయించిన ప్రభుత్వ లగ్జరీ కారు సౌకర్యాన్ని ఉపసంహరించుకుందామన్న ఎస్టేట్ శాఖ ప్రతిపాదనను యోగీ ఆదిత్యనాథ్ తిరస్కరించారు. ములాయం వంటి కురువృద్ధ నేతకు లగ్జరీ కారు సౌకర్యాన్ని ప్రభుత్వ ఖర్చుతో కొనసాగించాలనే యోగి నిర్ణయించారు. ములాయంతో సాన్నిహిత్యంగా మెలగడం, సత్సంబంధాలు నెరపడం యోగీ ఫ్యూచర్ ఎ÷-లాన్‌లో భాగమేనని.. ఆయన మద్దతుంటే.. యుపి బిసిల్లో మేజర్ షేర్‌ను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పొందవచ్చన్నది యోగీ మాస్టర్ ఎ÷-లాన్ అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# జర్మనీ తరహాలో పంటకాలనీలు

## అక్కడి క్షేత్రాలను పరిశీలించిన మంత్రి నిరంజన్

హైదరాబాద్,నవంబర్ 1 (ఆర్ఎన్ఎ): జర్మనీ తరహాలో తెలంగాణ రాష్ట్రంలోనూ పంట కాలనీలతోపాటు మాల్స్ తరహాలో వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటుకు ప్రోత్సాహం ఇస్తామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. జర్మనీ పర్యటనలో భాగంగా బెర్లిన్ సమీపంలో ఉన్న సమీకృత వ్యవసాయ క్షేత్రాన్నిఆయన సందర్శించారు. ఇలాంటి క్షేత్రాలకు అక్కడ మంచి ఆదరణ ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనూ ప్రయోగాత్మకంగా ఇలాంటివి ఏర్పాటు చేస్తే ఆదరణ లభించే అవకాశం ఉందన్నారు. జర్మనీ తరహాలోనే ఒకే చోట అన్నిరకాల కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు, పాలు వంటి వాటిని వ్యవసాయ క్షేత్రం వద్దనే విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. రైతులతోపాటు చాలా మందికి ఉపాధి కల్పించవచ్చన్నారు. తెలంగాణలో ఇప్పటికే సేంద్రీయ వ్యవసాయానికి ప్రభుత్వం సహకారం అందిస్తోందని అన్నారు. సమీకృత సమగ్ర వ్యవసాయ క్షేత్రాలతో ఉపాధితోపాటు రైతులకు ఆదాయం లభించే అవకాశం ఉంటుందన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి బృందంలో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, ఎమ్మెల్యేల ఆలవెంకటేశ్వరరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# ఎంపి సోయం తీరు సరికాదు

## మండిపడ్డ ఎమ్మెల్యే జోగు

ఆదిలాబాద్,నవంబర్ 1 (ఆర్ఎన్ఎ): ఒక్క సంతకంతో ఎస్టీల జాబితా నుంచి లంబాడాలను తొలగిస్తామని చెప్పి.. ఇప్పటివరకు ఎందుకు చేయలేకపోయావని ఎంపి సోయం బాపురావును ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న ప్రశ్నించారు. 'లంబాడాలను ఎస్టీల నుంచి తొలగిస్తామని .. బీజేపీ రాష్ట్ర నేతలతో చెప్పించే దమ్ము బాపురావుకు ఉందా? అలా ప్రకటన చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా' అని జోగు రామన్న సవాల్ విసిరారు. కలెక్టర్, ఎస్పీ ఆఫీసులు ఉండవంటూ ఉగ్రవాదిలా బాపురావు వ్యాఖ్యలు చేశారన్నారు.

ఎవరు అవినీతికి పాల్పడ్డారో చర్చకు సిద్ధమని జోగు రామన్న పేర్కొన్నారు. ఆదివాసీల ఉద్యమానికి వ్యతిరేకంగా తాము ఎన్నడూ మాట్లాడలేదని జోగు రామన్న తెలిపారు.

అయితే ఎంపి స్థాయిలో తాను చేసిన ప్రకటనలకు కట్టుబడి హామీలు అమలు చేయాలన్నారు.

# మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం

## నిందితుడికి జీవిత ఖైదు విధించిన కోర్టు

సంగారెడ్డి,నవంబర్ 1(నేటినిజం ప్రతినిధి): మూడేళ్ల బాలికకు చాక్లెట్ ఆశ చూపి కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి సంగారెడ్డి కోర్టు రూ. 5 వేలు జరిమానా, జీవిత కాలం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన పి శ్రీనివాస్ (57) బతుకుదెరువు కోసం సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మండలం మూర్తినగర్ లో ఉంటూ వాచ్ మెన్‌గా పని చేస్తున్నాడు. 2017 డిసెంబర్ 31న ఆర్సీపురం ప్రాంతానికి చెందిన ఓ బాలిక (3) తల్లిదండ్రులతో కలిసి ఇంటి సమీపంలో ఉన్న కూరగాయలు కొనేందుకు వెళ్ళింది. అదే సమయంలో శ్రీనివాస్ మద్యం తాగి ఇంటికి వెళుతుండగా స్థానికంగా ఉన్న గ్రేవ్ యార్డ్ సమీపంలో ఏడుస్తూ కనబడింది. దీంతో శ్రీనివాస్ బాలికకు బిస్కెట్ ఇప్పిస్తానని చెప్పి చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లి లైంగికదాడి చేశాడు. దీంతో బాలిక గట్టిగా ఏడవటంతో శ్రీనివాస్ అక్కడ నుంచి పరారయ్యేం దుకు ప్రయత్నించగా అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి శ్రీనివాస్‌ను ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో అతడిని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శ్రీనివాస్‌ను రిమాండ్ కు పంపించారు. కేసు విచారణలో భాగంగా సంగారెడ్డి కోర్టు న్యాయమూర్తి బి. పాపి రెడ్డి నిందితుడు శ్రీనివాస్ కు రూ. 5 వేలు జరిమానా, జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ... ఈ కేసు విచారణలో సహకరించిన అప్పటి మియాపూర్ ఏసీపీ రవికుమార్, ఆర్ సీపురం ఇన్స్పెక్టర్ జె.రమేష్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ రెడ్డి, రైటర్లు ఎస్పై భాస్కర్, రామ్ చందర్, కానిస్టేబుల్లు సల్మాన్, నారాయణ, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు గాల్ రెడ్డి, సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డిసిపి అనసూయ, కోర్ట్ మానిటరింగ్ సెల్ అడిషనల్ డీసీపీ ఇందిరలను అభినందించారు.

# పసిపాపతో అనుమానస్పద వ్యక్తి సంచారం

## సమాచారం అందుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,అక్టోబర్ 1(ఆర్ఎన్ఎ): జూబ్లీ బస్టాండులో దారుణం జరిగింది. బతుకున్న పసికందును బ్యాగులో పెట్టుకొని జూబ్లీ బస్టాండులో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు తిరుగుతుండగా, గమనించిన ఓ ఆటో డ్రైవర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని జూబ్లీ బస్టాండు మొత్తం వెతకడం మొదలు పెట్టారు. అయితే పోలీసులను చుసిన ఆ ఇద్దరు వ్యక్తులు అక్కడ నుండి పారిపోయి జూబ్లీ బస్టాండు వెనుక దాక్కున్నారు.

అయితే వారిని పట్టుకున్న పోలీసులు వెంటనే ఆ బ్యాగులో ఏముందో అని చూస్తే.. నిద్రపోతున్న ఓ పాప కనిపించింది.ఆ పాప ఎవరు ఏంటి? ఎక్కడ నుంచి వచ్చారు ? ఎందుకు బ్యాగులో పెట్టారు ? పాప తల్లిదండ్రులు ఎవరు అని ఆ నిందుతలను ప్రశ్నించగా.. పోలీసులకు పొంతనలేని సమాదానాలు చెప్పాడు. అయితే ఆ పాప తమ మనవరాలిని.. చనిపోయిందని.. పూడ్చటానికి వచ్చామని పొంతనలేని సమాదానాలు చెప్పాడు. దీంతో పాపను చూస్తే ఆమె బతికే ఉంది. అనుమానం వచ్చి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

అనంతరం పాపను గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన గురువారం ఉదయం 9 గంటలకు జూబ్లీ బస్టాండు ప్రాంతం వద్ద జరిగింది. అయితే పాప ఎవరు ? తల్లిదండ్రులు ఎవరు ? ఎందుకు బ్యాగులో తీసుకొచ్చారు అనేది తెలియాల్సి ఉంది.

# ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించిన సిఎస్

హైదరాబాద్, నవంబర్ 1(ఆర్ఎన్ఎ): దేశ వ్యాప్తంగా జరిగిన రాష్ట్రీయ ఏక్తాదివస్ సందర్భంగా గురువారం బిఆర్‌కెఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కెజోషి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈసందర్భంగా సెక్రటేరియట్ ఉద్యోగులతో ఏక్తాదివస్ ప్రతిజ్ఞ చేయి ంచారు. ' దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను పరిరక్షించడానికి నాకు నేనుగా అంకితమౌతూ నా తోటి దేశ వాసులలో ఈ సందేశాన్ని వ్యాప్తి చేయడానికి కూడా శాయశక్తుల కృషి చేస్తానని సత్య నిష్టతో నేను ప్రమాణం చేస్తున్నాను. నా దేశ ఐక్యత స్ఫూర్తితో ఈ ప్రతిజ్ఞను చేపడతాను. ఈ ఐక్యత సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆర్కనీయకత, చర్యల ద్వారా సాకారం అయినది. నా దేశ అంతర్గత భద్రతను కాపాడడానికి నా స్వంత తోడ్పాటును అందించాలని కూడా సత్యనిష్టతో తీర్మానిస్తున్నాను' అంటూ అధికారులు, ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (జీఏడీ) తదితరులు పాల్గొన్నారు.

# గంటలో రెండువేల మొక్కలు నాటే కార్యక్రమం

## హరితహారంతో అడవులను పెంచే లక్ష్యం
## అధికారులతో సమీక్షలో మంత్రి తలసాని

హైదరాబాద్,నవంబర్ 1(ఆర్ఎన్ఎ): ఒక గంటలో రెండు వేల మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టామన్నారు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. సికింద్రాబాద్ బుద్ధభవనంలో ఈ నెల 4న చేపట్టనున్న హరితహారం కార్యక్రమంపై అధికారులుతో సమావేశమై చర్చించారు. సనత్ నగర్ నియోజక వర్గంలో 4వ తేదీన 10గంటల నుండి 11గంటల వరకు ఒక గంటలో 2వేల మొక్కలు నాటడానికి ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు మంత్రి తలసాని. ఈ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, ఇంద్ర కరణ్ రెడ్డి తో పాటు రాజ్యసభ సభ్యులు సంతోష్ లు కూడా పాల్గొంటారన్నారు. హరితహారం కార్యక్రమంలో భారీ సంఖ్యలో టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ,స్వచ్ఛంద సంస్థలతో పాటు కాలేజీ విద్యార్థులు పాల్గొననున్నట్లు మంత్రి తలసాని తెలిపారు. భారీ సంఖ్యలో మొక్కలు నాటడం ద్వారా అడవులను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమాన్ని నవంబరు 4న సికింద్రాబాద్‌లో భారీఎత్తున చేపడుతున్నట్టు మంత్రి తలసాని తెలిపారు. గురువారం సికింద్రాబాద్‌లోని బుద్ధభవన్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హరితహారంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈనందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 2015, జూలైలో తెలంగాణ ప్రాంతంలో అటవీవిస్తీర్ణాన్ని పెంచి స్వచ్ఛమైన వాతావరణాన్ని భావితరాలకు అందించేందుకు హరితహారం కార్యక్రమానికి శ్రీరారం చుట్టిందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 24శాతం అటవీ ప్రాంతాన్ని నూటికి నూరుశాతం మొక్కల పెంపకం, పట్టణ, గ్రామాల్లో కూడా సామాజిక అడవుల పెంపకం, సహజసిద్ధ అడవులను పరిరక్షించడం, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. మొక్కల పెంపకం వంటి లక్ష్యాలతో హరితహారం కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. తెలంగాణ ప్రాంతమంతా పచ్చదనంతో కళకళలాడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్నిచేపట్టినట్టు తెలిపారు. పారిశ్రామికీకరణతో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కల పెంపకం ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. నవంబరు 4న సికింద్రాబాద్‌లోని మినిస్టర్‌రోడ్‌లో భారీ ఎత్తున హరితహారం కార్య క్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలుచేయాలని అధికారులను ఆదేశించారు. హరితహారంలో భాగంగా ఆ ప్రాంతంలో పెద్దసంఖ్యలో మొక్కలు నాటి దేశానికే ఆదర్శనంగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసి ఎన్‌పోర్స్‌మెంట్ డైరెక్టర్ విశ్వజిత్, అడిషనల్ డిసిపి భాస్కర్, జోనల్‌కమిషనర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో పెరగనున్న భూగర్భ జలాలు

## ఉమ్మడి జిల్లాలో భారీగా నిర్మాణాలకు అనుమతి

నిర్మల్,నవంబర్1(ఆర్ఎన్ఎ): నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో స్థానికంగా ప్రవహించే వాగులు, నదులపై చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గతంలోనే స్వర్ణవాగుపై మూడు చెక్‌డ్యాంలను నిర్మించిన విషయం తెలిసిందే. తాజాగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో మరో 8 చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందుకోసం రూ. 15.87 కోట్ల నిధులను మంజూరు చేసింది. చెక్‌డ్యాంల నిర్మాణంతో పరిసర ప్రాంతాల్లోని రైతుల భూములకు సాగునీరు అందుతుంది. మరోవైపు చెక్‌డ్యాంలకు ఎగువన ఎక్కువ దూరం వరకు నీటి నిల్వ ఉండడంతో భూగర్భజలాలు గణనీయంగా పెరగనున్నాయి. దీంతో బోరుబావుల్లో ఏడాది మొత్తం నీరు పుష్కలంగా వచ్చే అవకాశం ఉంటుంది. పరిసర ప్రాంత రైతులు చెక్‌డ్యాంల నుంచి పంపులతో నీటిని తోడుకునేందుకు అవకాశం ఉంటుంది. రైతు అవసరాన్ని బట్టి నీటిని తోడుకునే అవకాశం ఉంటుంది. రైతుల పొలాల్లో మిగిలిన నీరు తిరి గి చెరువులకు చేరనుంది. పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టుల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందనుంది. పరిసర ప్రాంతాల్లో పశువులకు అవసరమైన తాగునీరు కూడా నిరంతరంగా అందుబాటులో ఉండనుంది. 24ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం తో వీటిని నిర్మిస్తుండగా.. సుమారు 1100 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో 4 చెక్‌డ్యాంలను టెండర్లు పిలువగా.. నిర్మల్ జిల్లాలో 4 చెక్‌డ్యాంలను టెండర్లు పిలువాల్సి ఉంది. ఈ 8 చెక్‌డ్యాంలకు నిధులు మంజూరు చేయగా.. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. నిర్మల్ జిల్లాల్లో లక్ష్మణచాంద మండలం వడ్యాల్, చామన్‌పెల్లి, పొట్టపెల్లి, చింతల్‌చాంద గ్రామాల శివారులో మేడిపెల్లి వాగుపై చెక్‌డ్యాంలు నిర్మిస్తారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ మండలం భీంసరి, జైనథ్ మండలం కాప్రి, కమ్టా, తాంసి మండలం పొన్నారి గ్రామ శివారులో స్థానిక వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించాలని నిర్ణయించారు. నిర్మల్ జిల్లాలోని మేడిపెల్లి వాగుపై లక్ష్మణచాంద మండలంలో 13ఎంసీఎఫ్‌టీ సామర్థ్యంతో 4 చెక్‌డ్యాంలు నిర్మిస్తుండగా.. 480 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తారు. ఆదిలాబాద్ జిల్లాలో నాలు గు చెక్‌డ్యాంలు నిర్మిస్తుండగా.. 620 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం వాగు, పలికేరువాగు, ఖానాపూర్ వాగుపై ఏడు చోట్ల చెక్‌డ్యాంలు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరగా.. నిధుల మంజూరు విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. చెక్‌డ్యాంల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక కృషి చేశారు. ఆయన చొరవతోనే ఈ నిధులు మంజూరు కాగా.. నిర్మాణాలు పూర్తయితే నీటిని నిల్వ చేయడంతో పాటు పరిసర రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. స్వర్ణవాగుపై నీటి నిల్వ కోసం 12చెక్‌డ్యాంలు నిర్మించాలని నిర్ణయించగా.. మూడు చెక్‌డ్యాంలకు నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేశారు. మిగతావి దశల వారీగా మంజూరు చేయనున్నారు. రూ.15.96 కోట్లతో సారంగాపూర్ మండలం ఆలూరు, నిర్మల్ మండలం తాంశ, సోన్ మండలం సాకేర గ్రామాల వద్ద మూడు చెక్‌డ్యాంలు నిర్మించారు. ఈ చెక్‌డ్యాంలతో సుమారు 3వేల ఎకరాలకు నీరందుతోంది. చెక్‌డ్యాంల ఎగువన కొన్ని కిలోమీటర్ల వరకు నీరు నిల్వ ఉండగా.. భూగర్భజలమట్టం బాగా పెరిగింది. ఉమ్మడి జిల్లాలో స్థానిక వాగులపై 8చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఇవి పూర్తయితే పరిసర రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారుతాయన్నారు.

# ప్లాస్టిక్ వాడకాలకు దూరంగా ఉండాలి

## గ్రామాల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలి
## అధికారుల సూచన

మంచిర్యాల,నవంబర్1(ఆర్ఎన్ఎ): పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలు స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ స్వరూపారాణి సూచించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలనీ, కూరగాయలు, దుకాణాలకు వెళ్లేటపుడు బట్ట స

# నగర రోడ్లకు ఇక మహర్దశ

## ప్రైవేట్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యత
## విమర్శలతో రంగంలోకి దిగిన అధికారులు

హైదరాబాద్,నవంబర్1(ఆర్ఎన్ఎ): నగర రోడ్లకు ఇక మహర్దశ పట్టనుంది. రోడ్లను అద్దంలా ఎప్పటికప్పుడు ఉంచేలా చర్యలకు ప్రభుత్వంశ్రీకారం చుడుతోంది. ప్రైవేట్ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించడంతో పాటు, వాటికే నిర్వహణ అప్పగిస్తారు. దీంతో నిర్వహణ సులువు కానుంది. నగరంలోని ప్రధాన రోడ్లు తరచూ పాడవుతుండడమే గాకుండా వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. జీహెచ్ఎంసీ ద్వారా నిర్వహిస్తున్నప్పటికీ ఫలితం ఉండటంలేదు. చిన్నవర్షానికే గుంతలు పడటం, కొట్టుకుపోవడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏటా. రూ. 800 కోట్ల వరకూ ఖర్చుచేస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. దీంతో జాతీయ రహదారుల మాదిరిగా నగరంలోని ప్రధాన రహదారులను కూడా ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తే ఫలితం ఉంటుందని ప్రభుత్వం భావించింది. గ్రేటర్ పరిధిలోని రోడ్లన్నింటినీ గతంలో మాదిరిగా ఒకే గొడుగుకిందకి తెచ్చి ప్రధాన రోడ్లను ప్రైవేట్‌కు అప్పగించి, మిగిలిన వాటిని జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయించారు. పురపాల కశాఖ మంత్రి కేటీ రామారావు ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం సందర్భంగా ప్రధాన రోడ్ల సమగ్ర నిర్వహణ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు కార్యప్రణాళిక సిద్ధంచేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జీహెచ్ఎంసీల ఆధీనంలోని ప్రధాన రోడ్లను సుమారు 709 కిలోమీటర్లమేర సమగ్ర నిర్వహణ కోసం ప్రతిపాదనలు సిద్ధంచేసి టెండర్లు ఆహ్వానించారు. ఇందులో అధికంగా జాతీయ, రాష్ట్ర రహదారుల ఆధీనంలోని రోడ్లే కావడం విశేషం. మెట్రో రైలు మార్గంలోని రోడ్ల మరమ్మతు పనులు మెట్రోరైలు సంస్థ నిర్వహిస్తుండగా, ఇతర రోడ్లను హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్ఆర్డీసీఎల్) నిర్వహిస్తున్నది. తాజాగా, వీటన్నింటినీ సెంటర్ మీడియన్‌లు, ఫుట్‌పాత్‌లు, పారిశుధ్యం, మురుగునీటి, వరదనీటి కాలువలు తదితర అన్ని పనులూ ఎంపిక చేసిన ప్రైవేట్ ఏజెన్సీలు నిర్వహిస్తాయి. నిర్వహణ కాంట్రాక్టు ఐదేండ్ల పాటు ఉంటుంది. ఈ ఐదేండ్లలో 709 కిలోమీటర్లపై రూ. 1827 కోట్లు ఖర్చు చేస్తారు. ఏజెన్సీలను ఖరారు చేసేందుకు టెండర్లు ఆహ్వానించిన జీహెచ్ఎంసీ, వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకు టెండర్లకు గడువిచ్చారు. నవంబర్ మూడో వారంకల్లా టెండర్లు, ఒప్పందాల ప్రక్రియంతా పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని ఓ ఉన్నతాధికారి తెలిపారు. బస్సులు నడిచే ప్రధాన రోడ్లను మాత్రమే 709 కిలోమీటర్లమేర ప్రైవేట్‌కు అప్పగించనున్నారు. మిగిలిన అంతర్గత రోడ్ల నిర్వహన యథావిధిగా జీహెచ్ఎంసీయే చేపడుతుంది. కాగా, ఇంతకాలం హెచ్ఆర్డీసీఎల్ నిర్వహించిన రోడ్లను పూర్తిగా ప్రైవేట్ ఆధీనంలోకి తెస్తుండడంతో హెచ్ఆర్డీసీఎల్ ఉనికి ప్రశ్నార్థమైందని చెప్పవచ్చు.

# రెండు దశల్లో మున్సిపల్ ఎన్నికలు?

## కోర్టు స్టే ఉన్న వాటికి రెండో దశ ఎన్నిక
## కసరత్తు చేస్తోన్న ఎన్నికల సంఘం

హైదరాబాద్,నవంబర్1(ఆర్ఎన్ఎ): తెలంగాణలో మునిసిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. సోమవారం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా రెండు దశల్లో మునిసిపోల్స్ నిర్వహించ నున్నట్టు తెలుస్తోంది. కోర్టు సమస్యలు లేని మునిసిపాలిటీలకు మొదటిదశలో ఎన్నికలు నిర్వహించ నున్నట్టు తెలుస్తోంది. కోర్టు విచారణలో ఉన్న మునిసిపాలిటీలకు రెండో దశలో ఎన్నికలు నిర్వహించనున్నట్టు సమాచారం. మొదటిదశ మునిసిపాలిటీల రిజర్వేషన్ల కసరత్తును ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసింది. నోటిఫికేషన్ వెలువడగానే వార్డుల రిజర్వేషన్ల డ్రా జరగనుంది. అయితే రాష్ట్రంలో పాలకవర్గాల గడువు ముగిసిన మున్సిపాలిటీలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ యత్నాలకు అడ్డంకులు తొలగలేదు. గురువారం న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం వద్ద ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు కొలిక్కి రాలేదు. రాష్ట్రంలో 77 మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి హైకోర్టు ఇప్పటికే స్టే ఇచ్చింది. వీటి విషయంలో న్యాయపరమైన అవరోధాల తొలగింపునకు ఆదేశాలివ్వాలని అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచంద్రరావు అక్టోబర్ 22న ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనాన్ని కోరారు. ఎన్నికల పక్రియ చట్ట నిబంధనలకు అనుగుణంగా చేయలేదని దాఖలైన వ్యాజ్యాలను కొట్టివేస్తూ ధర్మాసనం తీర్పు చెప్పిన నేపథ్యంలో ఆయన ఈ అభ్యర్థన చేశారు. ఈ విషయాన్ని సింగిల్ జడ్జి దగ్గరే పరిష్కరించుకోవాలని డివిజన్ బెంచ్ చెప్పిన మేరకు అదనపు ఏజీ యత్నించారు. గడువు ముగిసిన మున్సిపాల్టీలు అన్నింటికీ ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా 77 మున్సిపాలిటీలపై జారీ చేసిన స్టే ఉత్తర్వుల్ని రద్దు చేయాలన్నారు. స్టేలు ఉన్న కేసుల్లోని అభ్యంతరాలపై దాఖలైన వ్యాజ్యాలను కొట్టివేస్తే ధర్మాసనం ఇచ్చిన తీర్పు సింగిల్ జడ్జి వద్ద మున్సిపాలిటీల కేసులకూ వర్తిస్తుందన్నారు. దీనిని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వ్యతిరేకించారు. 77 మున్సిపాలిటీలపై స్టే ఉత్తర్వులు, కేసుల వారీగా అభ్యంతరాలున్నాయని, వీటిలోని ఏ ఒక్క కేసులోనూ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదన్నారు. ఓటర్ల జాబితాల్లో లోపాలు తదితర అంశాలపై పిటిషనర్లు లేవనెత్తిన వాటిని పరిష్కరించకుండానే వ్యాజ్యాలన్నింటినీ తోసిపుచ్చమనడం చెల్లదని న్యాయవాది జంధ్యాల రవిశంకర్, ఇతరులు వాదించారు. ఎన్నికల ముందస్తు పక్రియ పూర్తికి 119 రోజులు అవసరమని సింగిల్ జడ్జి వద్ద చెప్పిన ప్రభుత్వం ఆ పక్రియను 30 రోజుల్లోనే ఎలా పూర్తి చేసిందో వివరించలేదన్నారు. వాదనలపై జస్టిస్ చల్లా కోదండరాం స్పందిస్తూ.. ధర్మాసనం తీర్పు తమ ముందు న్న కేసులన్నింటికీ వర్తిస్తుందని ఇరుపక్షాల న్యాయవాదులు అంగీకరిస్తే దీనికను గుణంగా ఉత్తర్వు లు జారీ చేస్తామన్నారు. భిన్నాభిప్రాయాల్ని వ్యక్తంమవ్వడంతో ప్రతి పిటిషన్‌లో ప్రభుత్వం తన వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేశాక పిటిషన్ల వారీగా విచారించి తీర్పు వెలువరిస్తామనా న్నారు. లేనిపక్షంలో ధర్మాసనం తీర్పును పరిశీలించి ఆ తీర్పు తమ ముం దున్న కేసులకు వర్తిస్తుందో లేదో తేల్చుతామన్నారు. ట్టపంగా విష యాల్ని తేల్చాలంటే ప్రభుత్వం మధ్యంతర ఉత్తర్వులున్న కేసులన్నింటిలోనూ కౌంటర్ దాఖలు చేస్తే విడివిడిగా విచారిస్తామన్నారు. మున్సిపాల్టీలన్నింటికీ ఒకేసారి ఎన్నికల నిర్వ హణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, స్టేలున్న కేసులపై విచారించాలని అదనపు ఏజీ కోరారు.

# కేటీఆర్ పరిశ్రమల శాఖ మంత్రి కావడం మన అదృష్టం: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్

యాదాద్రి భువనగిరి,నవంబర్ 1: దండుమల్కాపూర్‌లో టీఎస్ఐఐసీ-టీఐఎఫ్-ఎమ్మెస్ఎంఈ-గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు కోసం రైతులు తక్కువ ధరకు భూములిచ్చి పెద్ద మనసు చాటుకున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. భూసేకరణ విషయంలో తోడ్పాడునందించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

మంత్రి కేటీఆర్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును ప్రారంభించిన అనంతరం రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ..మునుగోడు ప్రజల తరపున మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ప్రజలు టీఆర్ఎస్‌ను నమ్ముతున్నరు కాబట్టే రెండోసారి అధికారం కట్టబెట్టారు. తెలంగాణ వస్తే మా బతుకులు బాగుపడ్తయని, మా జీవితాల్లో వెలుగు నింపుతయని ఎంతో ఆశతో కొన్ని లక్షల మంది యువకులు ఎదురుచూస్తున్నరు. అలాంటి యువకుల కోసం, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు చేపట్టిన కార్యక్రమం ఇదన్నారు. పారిశ్రామిక వేత్తలందరినీ ఈ వేదిక ద్వారా ఆహ్వానిస్తున్నామన్నారు. కేటీఆర్‌లాంటి అనుభవం, అవగాహన ఉన్న వ్యక్తి పరిశ్రమల శాఖ మంత్రి కావడం మన అదృష్టమని రాజగోపాల్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక మౌలిక వసతులతో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమలు పెట్టేందుకు వస్తున్న వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

# పర్మనెంట్ అడ్రస్ మార్చేస్తున్నా: డోనాల్డ్ ట్రంప్

హైదరాబాద్,నవంబర్ 1: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన పర్మనెంట్ అడ్రస్‌ను మార్చనున్నారు. న్యూయార్క్ నుంచి ఫ్లోరిడాలో ఉన్న పామ్ బీచ్‌కు వెళ్లనున్నట్లు ట్రంప్ తెలిపారు. తాజా ట్వీట్‌లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. సొంత నగరమైన న్యూయార్క్‌లో తనకు ఎటువంటి మర్యాద దక్కడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. తమ కుటుంబసభ్యులంతా ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌ను తమ శాశ్వత చిరునామాగా మార్చుకోనున్నట్లు ట్రంప్ తెలిపారు. న్యూయార్క్ అంటే ఇష్టమే కానీ, ఇన్నాళ్లూ ఆ నగరానికి ట్యాక్సుల రూపంలో బిలియన్ల డాలర్లు చెల్లించినా.. ఆ నగర రాజకీయవేత్తలు, తనను సరిగా చూడడం లేదని ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు. న్యూయార్క్‌లోని మన్‌హటన్ నుంచి ప్రైమరీ రెసిడెన్సీను మార్చాలని ఇటీవల మెలానియా ట్రంప్ దరఖాస్తు పెట్టుకున్నారు. దీనికి సంబంధించి స్థానిక పత్రికలో ఓ కథనం కూడా వెలుబడింది. తన గుండెలో న్యూయార్క్‌కు ప్రత్యేక స్థానం ఉంటుందని, కానీ ఆ నగరాన్ని వదిలి వెళ్లడం అనివార్యమన్నారు.

కానీ మరో అయిదేళ్లు మాత్రం వైట్‌హౌజ్‌లోనే ఉంటానని ట్రంప్ అన్నారు. ఎందుకంటే అమెరికాను మరింత గొప్పగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉందన్నారు. దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్ వైట్‌హౌజ్‌తో పాటు మార్ ఏ లాగో రిసార్ట్‌లో ఎక్కువ సమయం గడిపారు. ప్రెసిడెంట్ అయిన తర్వాత ఆయన ఆ రిసార్ట్‌లో 99 రోజుల పాటు ఉన్నారు. తన స్వంత ఇళ్లు ట్రంప్ టవర్‌లో మాత్రం ట్రంప్ కేవలం 20 రోజులే గడిపారు. అయితే వన్నుల పోటు నుంచి తప్పించుకునేందుకే న్యూయార్క్ వదలి ఫ్లోరిడా వెళ్తున్నారని ట్రంప్‌పై విమర్శలు వస్తున్నాయి.

# ఇండియాలో పెరువియన్ ఉత్పత్తులకు డిమాండ్

హైదరాబాద్,నవంబర్ 1 ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న లాటిన్ అమెరికన్ దేశాలలో ఒకటైన పెరూ, విస్తృత శ్రేణి ఉత్పత్తుల ఎగుమతులను ఇండియాలో విస్తరించడానికి సిద్ధంగా ఉంది. ఇది పెరుగుతున్న పెరువియన్ ఎగుమతులకు విస్తృత యూరోపియన్‌కు అనుగుణంగా ఉంటుంది. పెరూ తాజా ఎగుమతుల్లో అగ్ర ప్రాధాన్యతలో భారతదేశం ఉంది. పెరూ నుంచి భారతదేశానికి దిగుమతి చేసుకునే ముఖ్యమైన వస్తువులలో రాగి, బంగారం, కాల్షియం యొక్క ఫాస్ఫేట్లు, జింక్, లీడ్ మినరల్స్, ఫిష్ పిండి, సింథటిక్ కేబుల్స్, ఫ్రెష్ గ్రేప్స్, కోకో బీన్స్ ఉన్నాయి. పెరూ ప్రపంచంలోని టాప్ టెన్ ఆహార సరఫరాదారులలో ఒకటి. వ్యవసాయ రంగం నుంచి ఎగుమతులను పెంచడానికి సూపర్ ఫుడ్స్ పెరూ అనే కొత్త వర్గాన్ని గుర్తించింది. ఇందులో ఆస్పరాగస్, పాషన్ ఫ్రూట్, పర్పుల్ కార్న్, క్వినోవా, కోకో ఉన్నాయి. అల్పాకా ఫైబర్ ప్రీమియం గార్మెంట్స్ ఉత్పత్తి చేయడానికి టెక్స్‌టైల్ రంగాన్ని అగ్రశ్రేణి నాణ్యతతో నడిపిస్తుంది. పెరువియన్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ టూరిజం బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ లూయిస్ టోర్రెస్ మాట్లాడుతూ కొత్త మార్కెట్లకు ఎగుమతులను ప్రోత్సహించడానికి మా ప్రయత్నాలను ముమ్మరం చేశామన్నారు. దీని కోసం బలమైన ప్రణాళికను అమలు చేస్తున్నామని తెలిపారు. పెరూ, భారతదేశం మధ్య సంబంధం బలంగా కొనసాగుతుందన్నారు. పెరువియన్ కంపెనీలు వాణిజ్యానికి ఈ దేశం ఆసియాలో కీలక మార్కెట్ అవుతుందన్నారు. పెరువియన్ కంపెనీల ఎగుమతుల కోసం చేసే ప్రయత్నాలను కేంద్రీకరించడానికి భారతదేశం సరైన మార్కెట్ అన్నారు. పెరువియన్ ఎగుమతిదారులు ఆసియా దేశాలలో వ్యూహాత్మక వ్యాపారం తీవ్రమైన కార్యక్రమంలో పాల్గొనడానికి ప్రణాళికలు వేస్తున్నామని పేర్కొన్నారు. మా వాణిజ్య ఉత్పత్తులు,సేవలతో పాటు మార్కెట్లలో కూడా అభివృద్ధి చెందినట్లు తెలిపారు. నవంబర్ 3, 4 తేదీల్లో ఎక్స్‌పో పెరూ దుబాయ్ 2019 జరుగుతుందని తెలిపారు.

## ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

చెన్నై,నవంబర్1(ఆర్ఎన్ఎ): చెన్నై నుంచి కువైట్ వెళ్లవలసిన ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయ్యింది. టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాలకు స్మోక్ అలారమ్ రావడంతో.. విమానాన్ని చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా దించారు. అర్ధరాత్రి 1.20 నిమిషాలకు టేకాఫ్ తీసుకున్నది. అయితే కార్గో క్యాబిన్‌లో పొగ రావడంతో.. పైలట్ విమానాన్ని అరగంటలోనే మళ్లీ విమానాశ్రయానికి తీసుకువచ్చాడు. ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో విమానంలో 150 మంది ప్రయాణికులు ఉన్నారు. మళ్లీ తెల్లవారుజామున 4.30 నిమిషాలకు మరో విమానంలో ప్రయాణికులను పంపించారు.

# బంగారం వెల్లడి పథకం ఆలోచన లేదు

## పుకార్లపై స్పందించిన ఆర్థిక శాఖ అధికారులు

న్యూఢిల్లీ,నవంబర్ 1 (ఆర్ఎన్ఎ): పరిమితికి మించి ఉన్న బంగారం వివరాలను స్వచ్ఛందంగా తెలిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ పథకం తీసుకొస్తున్నట్లు వచ్చిన వార్తలను కేంద్రం తోసిపుచ్చింది. అలాంటి పథకమేదీ ఆలోచనలో లేదని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయంలో మీడియాలో వచ్చిన కథనాలను కొట్టిపారేశారు. బంగారం విషయంలో 'స్వచ్ఛంద వెల్లడి' లాంటి పథకాలను తీసుకొచ్చే ప్రతిపాదనేదీ లేదని తేల్చి చెప్పారు. బ్జడెట్ తయారీ సమయంలో ఇలాంటి వార్తలు రావడం సహజమేనని తెలిపారు. కాగా.. పెద్ద నోట్ల రద్దు తర్వాత నల్ల ధనాన్ని బంగారం రూపంలోకి మార్చడం ఎక్కువైందని భావిస్తున్న కేంద్రం.. బంగారం విషయంలో 'స్వచ్ఛంద వెల్లడి' పథకాన్ని ప్రవేశపెడుతుంది. ఈ పథకం ప్రకారం ప్రతి ఒక్కరూ తమ వద్ద నిల్వ ఉన్న బంగారం వివరాలను బయటపెట్టాలి. పరిమితికి మించి ఉన్న బంగారం నిల్వలపై పన్ను విధించి 'అమెస్టీ' కింద శిక్షించకుండా వదిలేస్తుందంటూ వార్తలొచ్చిన విషయం తెలిసిందే. దీనిపై వారతల దుమారం రేగడంతో వెంటనే స్పందించిన అధికారులు అలాంటి ప్రతిపాదనేదీ లేదని వివరించారు.

# భూసమస్యలు తక్షణం పరిష్కరించాలి: ఆర్‌డీవో

జనగామ,నవంబర్1 (ఆర్ఎన్ఎ):గ్రామాల్లో ఎస్సీ,ఎస్టీలు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో మధుమోహన్ తెలిపారు. గ్రామాల్లో ప్రజలు అందరితో కలసి ఉండాలని, ఎవరూ కులాల పేరుతో ఒకరినొకరు కించపరుచుకోవద్దని తెలిపారు. ప్రజలందరికీ చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నదని, వాటిని వినియోగించుకొని బలోపేతం కావాలని సూచించారు. బచ్చన్నపేట తహసీల్ కార్యాలయాన్ని ఆర్డీవో మధుమోహన్ సందర్శించి పలు పెండింగ్ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. చిన్నరామన్‌చర్ల శివారు గోపాల్‌నగర్‌లో వివాదంగా మారిన స్థలాన్ని ఆయన సందర్శించి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు, వీఆర్‌వోలు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో నాణ్యమైన సేవలు అందించాలన్నారు. భూ సమస్యలపై సత్వరం స్పందించాలన్నారు. ప్రజలను, రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని అధికారులక సూచించారు.

# ఉత్తమ శిక్షణతోనే ఉపాధి

నల్లగొండ,నవంబర్1(ఆర్ఎన్ఎ): ప్రపంచ మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా శిక్షణ పొందితేనే ఉద్యోగాలు సాధిస్తారని యువతకు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మార్కండేయ తెలిపారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌పై కళాశాల విద్యార్థులకు నిర్వహించనున్న వారం రోజుల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి కంపెనీ ఆన్‌లైన్‌లోనే పరీక్షలు నిర్వహిస్తున్నదని వివరించారు. అందుకు అనుగుణంగా ఇచ్చే శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్ సొంతం చేసుకోవాలన్నారు. కంపెనీలు నిర్వహించే ఇంటర్వ్యూల్లో నైపుణ్యం, రాత పరీక్ష, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. అలాగే విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు, సమాజానికి ఉపయోగపడే విధంగా చైతన్యపరిచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కంపెనీ పని చేస్తుందని చెప్పారు.

# త్వరగా ఇంటర్ సిలబస్ పూర్తి చేయాలి

నిర్మల్,నవంబర్1(ఆర్ఎన్ఎ): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అలెగ్జాండర్ అన్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కలిపస్తున్నామన్నారు. ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. కళాశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. అధ్యాపకులు గడుపులోగా పాఠ్యాంశాలను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు ప్రాక్టికల్స్ వకడ్బందీగా నిర్వహించాలన్నారు.

# ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి

గద్వాల,నవంబర్1(ఆర్ఎన్ఎ): ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జేసీ నిరంజన్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఫిర్యాదులను ఆయా శాఖల వారిగా పంపుతామని, అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన సూచించారు.

ఫిర్యాదులు తీసుకున్న అధికారులు ఏఏ సమస్యలు పరిష్కరించారో ఎప్పటికప్పుడు తమకు సమాచారం ఇవ్వాలని జేసీ ఆదేశించారు. డయల్ యువర్ కలెక్టర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను సైతం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు.

# కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నాడు

## - రాష్ట్రంలో పరిస్థితులపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం
## - బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణసాగర్

వరంగల్, నవంబర్1(ఆర్ఎన్ఎ) : రెండోసారి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్‌కు ధనదాహం, పదవివ్యామోహం పెరిగిందని బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణసాగర్ రావు విమర్శించారు. శుక్రవారం హన్మకొండ బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాసిస్టు నిర్ణయాలతో ధనిక రాష్ట్రాన్ని దివాళా రాష్ట్రంగా మార్చారన్నారు. తన జేబులు నింపుకోవడం తప్ప.. సంక్షేమ పథకాలకు కూడా నిధులు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె 30రోజుల నుండి నడుస్తోందని, ప్రజలు రవాణా వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కృష్ణసాగర్ అన్నారు. కార్మికుల సమస్యలు న్యాయబద్ధమైనవి కాబట్టే బీజేపీ మద్దుతు ఇస్తుందని కృష్ణసాగర్ రావు అన్నారు. ఆర్టీసీ పూర్తి స్థాయి ఎండీని నియమించకుండా కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు జీతాలు ఇవ్వకుండా 50 వేల మంది కార్మికుల కుటుంబాలను రోడుపై పడేసి చోద్యం చూస్తున్నారని, ఆర్టీసీ లెక్కలపై గవర్నర్‌ను కోరుతామని, ఆర్టీసీ ఆడిట పై లెక్కులు అడిగే అధికారం గవ ర్నర్‌కు ఉందన్నారు. రాష్ట్రంలో జరిగే పరిస్థితులపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని కృష్ణ సాగర్ రావు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల తో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. వేల పుస్తకాలు చదివిన కేసీఆర్..రాజ్యాంగాన్ని చదవడం మర్చిపోయారా?అని నిలదీశారు.

# సరికొత్త ఆలోచనలతో విద్యార్థులు ఉండాలి

రామగుండం,నవంబర్1(ఆర్ఎన్ఎ): సరికొత్త ఆవిష్కరణల వైపు విద్యార్థులు ఆలోచించాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్ రామగుండం లోకల్ సెంటర్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎంఎస్ వెంకట్రామయ్య సూచించారు. జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల స్టూడెంట్ చాప్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ స్టూడెంట్ చాప్టర్ ద్వారా విద్యార్థులు తమ ఆలోచనలను ఈ వేదిక మీదుగా పరస్పరం పంచుకోవచ్చన్నారు. తద్వారా లోతైన విషయ అవగాహనతో సరికొత్త ఆవిష్కరణలు చేయాలని సూచించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఇంజినీర్లు, రిటైర్డు ప్రొఫెసర్లు, వివిధ ప్రొఫెసర్లతో నిష్ణాత్తుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. దీని ద్వారా విద్యార్థులకు లబ్ది చేకూరుతుందనీ, విద్యార్థులు జ్ఞానదీప్తి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ స్టూడెంట్ చాప్టర్‌ను వేర్వేరుగా ప్రారంభించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# హరితహారం చాలా గొప్ప కార్యక్రమం: డైరెక్టర్ కే విశ్వనాథ్

హైదరాబాద్, నవంబర్ 1: రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఛాలెంజ్ లో ప్రముఖ సినీ దర్శకులు కళాతపస్వి కె.విశ్వనాథ్ పాల్గొన్నారు. కె విశ్వనాథ్ ఫిలింనగర్ లోని తన నివాసంలో కదంబ మొక్కను నాటారు. ఈ సందర్భంగా కె.విశ్వనాథ్ మాట్లాడుతూ..హరితహారం చాలా గొప్ప కార్యక్రమమన్నారు. పర్యావరణ పరిరక్షణకు సీఎం కేసీఆర్, ఎంపీ సంతోష్ కుమార్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొ న్నారు. పర్యావరణం రాను రాను క్షీణిస్తోం దని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని తెలియజేశారు. ఎంపీ సంతోష్ కుమార్ చెట్లు నాటే కార్య క్రమాన్ని భగీరథ ప్రయత్నంలా కొనసాగి స్తున్నారు. ఇది చాలా అభినందనీయం. వారు చేస్తున్న కృషిని అభినందిస్తున్నట్లు చెప్పారు.

# ఢిల్లీలో తీవ్రంగా వాయు కాలుష్యం

## కాలుష్య నియంత్రణ బోర్డు హెచ్చరిక
## గ్యాస్ ఛాంబర్‌లా మారిందన్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ,నవంబర్1(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో వాయు కాలుష్యం అతి తీవ్ర స్థాయిలో ఉందని పర్యావరణ కాలుష్య నియంత్రణ బోర్డు హెచ్చరించింది. ప్రస్తుతం ఆ స్థాయి అత్యంత ప్రమాదకర స్థాయిని దాటిందని ఆ సంస్థ తెలిపింది. దీంతో ఢిల్లీ నగరంలో నిర్మాణ కార్యక్రమాలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 5వ తేదీ వరకు నిర్మాణాలను నిలిపివేయాలన్నది. శీతాకాల సీజన్ మొత్తం బాణాసంచా పేల్చవద్ద అని కాలుష్య సంస్థ ఆదేశించింది. వాయు కాలుష్యం విషపూరితం కావడం వల్ల పబ్లిక్ ఎమర్జెన్సీ ప్రకటించింది. పిల్లలపై వాయు కాలుష్య ప్రభావం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరించింది. వాయు కాలుష్య సమస్యపై ఢిల్లీ పరిసర రాష్ట్రాలన్నీ సమస్య గురించి సానుకూలంగా చర్చించాలని కేంద్ర మంత్రి జవదేకర్ అన్నారు. ఢిల్లీలో ఓ గ్యాస్ చాంబర్‌లా తయారైందని సీఎం కేజీవ్రాల్ ఆరోపించారు.నగరంలో ఉన్న కాలుష్య పరిస్థితులపై తీవ్ర స్థాయిలో స్పందించారు. దేశ రాజధాని గ్యాస్ చాంబర్‌లా మారిందన్నారు. ఊపిరి ఆడని పరిస్థితి నెలకొందన్నారు. ఇవాళ స్కూల్ పిల్లలకు మాస్క్‌లు అందించిన సీఎం కేజీ